epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
విలేకరులు కావలెను
తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదరణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.
7036644111, 9490140565

సంపుటి: 19 | సంచిక: 300 | ఎడిటర్ : అలీ ముర్తుజా | మంగళవారం 22 సెప్టెంబర్ 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల:రూ.5 |



# సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.813 కోట్లు

**పరిహారం చెల్లింపుల్లో జాప్యం వద్దు**

- మార్కెట్ విలువకు చేరువగా పరిహారం ఉండాలి
- యుద్ధప్రాతిపదికన పంపిణీకి ఉత్తమ్ ఆదేశం
- భూసేకరణకు రూ.6 వేల కోట్లపై సీఎం హామీ

**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (సమయం న్యూస్):** సాగునీటి ప్రాజెక్టుల కోసం భూములు ఇచ్చిన రైతులకు చెల్లించాల్సిన పరిహారాన్ని ఏమాత్రం ఆలస్యం చేయకుండా అందించాలని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. భూసేకరణ, పునరావాసం-పునర్వ్యవస్థీకరణ కోసం ఇప్పటికే విడుదలైన నిధుల్లో జిల్లా స్థాయిలో పెండింగ్‌లో ఉన్న రూ.813 కోట్లను యుద్ధప్రాతిపదికన రైతుల చేతికి చేర్చాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఖాతాల్లో డబ్బు ఉండి.. పరిహారం అందక ప్రాజెక్టుల పనులు నిలిచిపోవడాన్ని సహించబోమని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్లతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భూసేకరణ, పరిహారం చెల్లింపుల పురోగతిని ఉత్తమ్ సమీక్షించారు. ఏప్రిల్ 1 నుంచి భూసేకరణ, పునరావాసానికి సంబంధించి సుమారు రూ.3,101 కోట్ల విలువైన టోకెన్లు సమర్పించగా, రూ.2,504 కోట్ల మేర నిధులు విడుదల చేసినట్లు అధికారులు వివరించారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న మొత్తంలో భూసేకరణ అధికారుల వద్ద రూ.502 కోట్లు, కలెక్టర్ల వద్ద రూ.311 కోట్లు ఉన్నట్లు సమావేశంలో వెల్లడైంది. భూములు కోల్పోయిన రైతులకు నిధులు చేరకుండా ప్రభుత్వ ఖాతాల్లోనే ఉండిపోవడం ఆందోళనకరమని ఉత్తమ్

వివరాలు 2లో..

## ఎల్‌నినో యాక్షన్ ప్లాన్‌పై అక్టోబర్ 2న తీర్మానాలు



- ప్రతి గ్రామ పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దాలి
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

2

# ఖరీదైన ప్రాంతాల్లోనే పేదలకు ఇల్లు

**వచ్చే బోనాల నాటికి లబ్ధిదారులతో బోనాలు ఎత్తిస్తాం**

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక..
- ఉచితంగా రిజిస్ట్రేషన్ హక్కులు
- రాయదుర్గంలో ఇండ్ల టవర్స్‌కు శంకుస్థాపన



హైదరాబాద్ మహానగరంలోని 'క్యూర్' పరిధిలో నివసిస్తున్న పట్టణ పేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరో చారిత్రాత్మక ఘట్టానికి శ్రీకారం చుట్టింది. శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని రాయదుర్గం మల్కం చెరువు సమీపంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ నిర్మాణ పనులకు రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పలువురు అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల కేటాయింపు పత్రాలను ఆయన పంపిణీ చేశారు.

2

# ట్యాంక్‌బండ్‌పై మళ్లీ ఉద్రిక్తత



- హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనానికి బారికేడ్లు తొలగించిన ఉత్సవ సమితి
- పోలీసుల ఆంక్షలను వ్యతిరేకించిన భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి
- సంప్రదాయ నిమజ్జనాన్ని అడ్డుకోవడం సరికాదని నేతల ఆగ్రహం
- కాలుష్య నియంత్రణ కోసం ట్యాంక్‌బండ్‌పై పీవోపీ విగ్రహాల నిమజ్జనానికి ఆంక్షలు
- పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు భారీగా పోలీసుల మోహరింపు

వినాయక నిమజ్జనోత్సవాల వేళ ట్యాంక్‌బండ్‌పై మరోసారి ఉద్రిక్తత నెలకొంది. హుస్సేన్‌సాగర్‌లో విగ్రహాల నిమజ్జనాన్ని అడ్డుకునేందుకు పోలీసులు, జీహెచ్‌ఎంసీ అధికారులు ఏర్పాటు చేసిన ఇనుప బారికేడ్లను భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు తొలగించారు.

వివరాలు 2వ పేజీలో

# డ్రగ్స్‌పై దేశవ్యాప్త ఉక్కుపాదం

- ఢిల్లీలో మూడో జాతీయ ఏఎన్‌టీఎఫ్ సదస్సు
- నేడు ప్రారంభించనున్న అమిత్ షా
- 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల చీఫ్‌ల హాజరు
- డ్రగ్ కార్టెల్స్ ఛేదింపుపై ప్రత్యేక దృష్టి
- డార్క్‌నెట్, క్రిప్టో లావాదేవీలపైనా చర్చ


4



## బాలికపై వేధింపులు ముగ్గురి అరెస్టు

- పదో తరగతి విద్యార్థులకు వేధింపులు
- వైరల్ వీడియోతో రంగంలోకి దిగిన పోలీసులు
- పోక్సో సహా పలు సెక్షన్ల కింద కేసు
- ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు
- కఠిన చర్యలు తీసుకోవాలన్న రాహుల్ గాంధీ

4






3

## జూరాల ఎడమ కాలువ వద్ద ఉద్రిక్తత

**పోలీసుల లాఠీ-ఛార్జ్, మాజీ ఎమ్మెల్యే చిట్టెం అరెస్టు**

పంటలను కాపాడుకునేందుకు కాలువలోకి దిగి రైతుల ఆందోళన

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా సాగునీటి పోరాటం

## 22ఏ నిషేధిత జాబితా వివాదం

- ప్రభుత్వానికి ఎన్‌హెచ్‌ఆర్సీ నోటీసులు
- ప్రైవేట్ భూములను నిషేధిత జాబితాలో చేర్చడంపై స్వతంత్ర విచారణకు ఆదేశం
- నాలుగు వారాల్లో సమగ్ర నివేదిక సమర్పించాలని సీఎస్‌కు స్పష్టీకరణ

2







## మూసీలోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు

విద్యార్థులకు తప్పిన ముప్పు

2

## రామ మందిర విరాళాల చోరీ నిందితుల గుర్తింపు

దర్యాప్తు దాదాపు పూర్తి చేసిన సిట్

25లోగా తొలి చార్జిషీట్ దాఖలు

సీసీటీవీలో 105 చోరీ ఘటనలు

ఇప్పటికేఎనిమిది మంది అరెస్టు

4





# ట్యాంక్‌బండ్‌పై మళ్లీ ఉద్రిక్తత

## హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనానికి బారికేడ్లు తొలగించిన ఉత్సవ సమితి

**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (సమయం న్యూస్):** వినాయక నిమజ్జనోత్సవాల వేళ ట్యాంక్‌బండ్‌పై మరోసారి ఉద్రిక్తత నెలకొంది. హుస్సేన్‌సాగర్‌లో విగ్రహాల నిమజ్జనాన్ని అడ్డుకునేందుకు పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు ఏర్పాటు చేసిన ఇనుప బారికేడ్లను భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు తొలగించారు. అనంతరం శోభాయాత్రగా వచ్చిన పలువురు హుస్సేన్‌సాగర్‌లో విగ్రహాలను నిమజ్జనం చేయడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. శతాబ్దాలుగా కొనసాగుతున్న నిమజ్జన సంప్రదాయాన్ని నిలిపివేయడం ద్వారా భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిమజ్జనానికి అడ్డుగా ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్స్, బారికేడ్లను తొలగించారు. నిమజ్జనోత్సవాల చివరి ఘట్టం సజావుగా సాగేందుకు ట్యాంక్‌బండ్‌పై ఆంక్షలను ఎత్తివేసి వాహనాలను అనుమతించాలని డిమాండ్ చేశారు. హుస్సేన్‌సాగర్‌లో కాలుష్యాన్ని తగ్గించేందుకు తెలంగాణ హైకోర్టు గతంలో పలు ఆదేశాలు జారీ చేసింది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనం చేయకుండా చర్యలు తీసుకోవాలని, పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి విగ్రహాలకు మాత్రమే అనుమతి ఇవ్వాలని స్పష్టం చేసింది. ఇతర విగ్రహాలను బేబీ పాండ్స్, ఎన్టీఆర్ మార్గ్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన నిమజ్జన కేంద్రాల వైపు తరలించాలని సూచించింది. ఈ నేపథ్యంలోనే ట్యాంక్‌బండ్ ప్రధాన రహదారి నుంచి హుస్సేన్‌సాగర్‌లోకి విగ్రహాలను తీసుకెళ్లకుండా అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఉత్సవ సమితి నేతలు బారికేడ్లను తొలగించడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ట్యాంక్‌బండ్ పరిసరాల్లో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తో పాటు అదనపు పోలీసు బలగాలను మోహరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టారు. కోర్టు ఆదేశాలు, ప్రభుత్వ సూచనలను పాటించాలని, నిబంధనలు ఉల్లంఘించవద్దని పోలీసులు ఉత్సవ సమితి నేతలకు సూచించారు.

# ఎల్‌నినో యాక్షన్ ప్లాన్‌పై అక్టోబర్ 2న తీర్మానాలు

## ప్రతి గ్రామ పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దాలి

## పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (సమయం న్యూస్):** ఎల్‌నినో ప్రభావంతో రానున్న కాలంలో ఎదురయ్యే పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు గ్రామస్థాయిలో పటిష్టమైన కార్యాచరణ రూపొందించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. ఖైరతాబాద్‌లోని పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖపై సోమవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అక్టోబర్ 2న నిర్వహించనున్న గ్రామ సభలు, ఎల్‌నినో నేపథ్యంలో గ్రామాల వారీగా చేపట్టాల్సిన పనులు, పంచాయతీల్లో అమలు చేయాల్సిన అభివృద్ధి ప్రణాళికపై మంత్రి సమీక్షించారు. సమావేశానికి స్పెషల్ సీఎస్ దానకిషోర్, అడిషనల్ కమిషనర్ పి.రవీందర్‌తోపాటు శాఖకు చెందిన ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని యాక్షన్ ప్లాన్‌పై అసెంబ్లీలో చర్చించి తీర్మానం చేశామని చెప్పారు. అక్టోబర్ 2న ప్రతి గ్రామ పంచాయతీలో నిర్వహించే గ్రామ సభల్లో ఎల్‌నినో యాక్షన్ ప్లాన్‌పై చర్చించి గ్రామస్థాయిలో అవసరమైన చర్యలపై తీర్మానాలు చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామానికి అవసరమైన పనులు ఏమిటి.. అందుబాటులో ఉన్న నిధులు ఎంత.. వచ్చే ఏడాది కాలంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ద్వారా గ్రామ పంచాయతీలకు అందే నిధులు ఎంత అనే అంశాలపై గ్రామ సభల్లో సమగ్రంగా చర్చించి గ్రామ అవసరాలకు అనుగుణంగా కార్యాచరణను ఆమోదించాలని మంత్రి సూచించారు.

# మూసీలోకి దూసుకెళ్లిన బస్సు



**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (సమయం న్యూస్) :** రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో స్కూల్ బస్సు అదుపుతప్పి మూసీ నదిలోకి దూసుకెళ్లిన సంఘటన సోమవారం జరిగింది. దీంతో బస్సులోని చిన్నారులు, స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. త్రుటిలో పెను ప్రమాదం తప్పడంతో చిన్నారుల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు, సంబంధిత అధికారులు ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. స్కూల్ బస్సు రోడ్డుపై నుంచి అదుపుతప్పి మూసీ నదిలోకి దూసుకెళ్లడంతో ఆ మార్గంలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. బస్సును అక్కడి నుంచి తొలగించేందుకు చర్యలు చేపట్టడంతోపాటు ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. డ్రైవర్ నిర్లక్ష్యమా లేక మరేదైనా కారణమా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు.

# సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.813 కోట్లు

మొదటి పేజీ తరువాయి

పేర్కొన్నారు. కలెక్టర్లు వ్యక్తిగతంగా జోక్యం చేసుకుని చర్చలు వేగవంతం చేసి అవార్డులు, పరిహారం చెల్లింపులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఏదైనా వాస్తవమైన కారణంతో నిధులు చెల్లించలేని పరిస్థితి ఉంటే కారణాన్ని వివరించి డబ్బును తిరిగి ప్రభుత్వానికి పంపాలని, ఖాతాల్లో నిరుపయోగంగా ఉంచవద్దని స్పష్టం చేశారు. 2026లో సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, పునరావాసం, అటవీ సంబంధిత అవసరాల కోసం రూ.6 వేల కోట్లు సమకూర్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని ఉత్తమ్ తెలిపారు. ప్రాధాన్య ప్రాజెక్టులకు నిధుల కొరత అడ్డంకి కాకుండా సాధారణ నీటిపారుదల బడ్జెట్‌కు వెలుపల నుంచి ఈ నిధులను సమకూరుస్తున్నట్లు వివరించారు.

### రైతులకు అన్యాయం జరగొద్దు

భూసేకరణలో రైతుల పట్ల మానవీయంగా వ్యవహరించాలని ఉత్తమ్ స్పష్టం చేశారు. అవార్డులు ఖరారై, చెల్లింపులకు సిద్ధంగా ఉన్న కేసుల్లోనే టోకెన్లు రూపొందించాలని సూచించారు. చట్టపరమైన నిబంధనలు, ప్రక్రియలకు లోబడి రైతులకు ఇచ్చే పరిహారం సాధ్యమైనంత



వరకు ప్రస్తుత మార్కెట్ విలువకు చేరువగా ఉండాలని చెప్పారు. అవార్డు తర్వాత కూడా పరిహారం చెల్లించని కేసుల్లో నిబంధనల ప్రకారం వర్తించే వడ్డీని చెల్లించాలని ఆదేశించారు. కోర్టు, యాజమాన్య వివాదాల్లో ఉన్న కేసులన్నింటినీ క్రోడీకరించి అడ్వకేట్ జనరల్ ద్వారా పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. నల్లగొండ, యాదాద్రి భువనగిరి, నారాయణపేట, సిద్దిపేట, వికారాబాద్, జగిత్యాల, హనుమకొండ సహా పలు జిల్లాల్లో భూసేకరణకు ఎదురవుతున్న అడ్డంకులను మంత్రి సమీక్షించారు. నల్లగొండ జిల్లాలో చింతపల్లి రిజర్వాయర్, పెండ్లిపాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, ఉదయసముద్రం, నెల్లికల్లు పనుల పురోగతిపై ఆరా తీశారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం పూర్తయినా పెండ్లిపాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు అవసరమైన భూసేకరణ పూర్తికాకపోతే పెట్టుబడుల ప్రయోజనం అందదని హెచ్చరించారు. పలు సాగునీటి ప్రాజెక్టులు ఇప్పటికే గణనీయంగా పూర్తయినా డిస్ట్రిబ్యూటరీ కాలువలు, అనుసంధాన పనులు, కొద్దిపాటి భూసేకరణ పెండింగ్‌తో వాటి ఫలాలు రైతులకు అందడం లేదని ఉత్తమ్ పేర్కొన్నారు. రెండు, మూడు వారాలు సాధారణ పరిపాలనా సమయమంటూ జాప్యం చేయకుండా గడువులను కుదించి పనులు పూర్తి చేయాలని కలెక్టర్లకు సూచించారు. నిధుల అవసరం ఉన్నప్పుడు, చెల్లింపులకు కేసులు సిద్ధమైన తర్వాతే కోరాలని.. ప్రభుత్వ సొమ్ము ఖాతాల్లో నిరుపయోగంగా ఉండకుండా ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు. సమీక్షలో మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్‌రాజ్, ఆర్థిక శాఖ కార్యదర్శి సందీప్ సుల్తానియా, భూసేకరణ కమిషనర్ శివకుమార్ నాయుడు, జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు.

# ఖరీదైన ప్రాంతాల్లోనే పేదలకు ఇల్లు

- వచ్చే బోనాల నాటికి లబ్ధిదారులతో బోనాలు ఎత్తిస్తాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక..
- ఉచితంగా రిజిస్ట్రేషన్ హక్కులు
- రాయదుర్గంలో ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌కు శంకుస్థాపన
- తొలి విడతలో ఒక్కో నియోజకవర్గానికి 480 ఇళ్లు



**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (సమయం న్యూస్):** హైదరాబాద్ మహానగరంలోని పట్టణ పేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని రాయదుర్గం-మల్కం చెరువు సమీపంలో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌కు రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. పట్టణ పేదలను నగరానికి దూరంగా పంపకుండా వారు నివసిస్తున్న ప్రాంతాలకు సాధ్యమైనంత దగ్గరలోనే సొంతింటిని అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు. పేదవాడి సొంతింటి కల అంటే కేవలం నాలుగు గోడలు, పైకప్పు కాదని.. ఆత్మగౌరవంతో జీవించే చిరునామా కల్పించడమే ఇందిరమ్మ టవర్స్ లక్ష్యమని పొంగులేటి చెప్పారు. హైదరాబాద్‌లో భూముల ధరలు అత్యధికంగా ఉన్న ప్రాంతాల్లోనే పేదలకు ఇళ్లు నిర్మించి భద్రత, భరోసా కల్పిస్తున్నామన్నారు. రాయదుర్గం ప్రాజెక్టును 2.85 ఎకరాల విస్తీర్ణంలో చేపడుతున్నట్లు వెల్లడైంది. ఇందిరమ్మ టవర్స్‌లో ఇల్లు పొందే ప్రతి కుటుంబానికి అపార్ట్‌మెంట్‌పై పూర్తి హక్కులతోపాటు 17 నుంచి 20 గజాల వరకు అవిభాజ్య భూవాటా కల్పిస్తామని మంత్రి తెలిపారు. సేల్‌డీడ్‌ను రిజిస్ట్రేషన్ చార్జీలు లేకుండా అందించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు చెప్పారు. ఇది కేవలం నివాసం మాత్రమే కాదని, పిల్లలకు, భవిష్యత్ తరాలకు మిగిలే ఆస్తి అని పేర్కొన్నారు. లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం, పైరవీలకు అవకాశం ఉండదని పొంగులేటి స్పష్టం చేశారు. అర్హత ఆధారంగా లాటరీ పద్ధతిలో పారదర్శకంగా ఎంపిక చేస్తున్నామని చెప్పారు. తెలంగాణ హౌసింగ్ బోర్డు లాటరీ ఎంపికలను బహిరంగంగా ప్రకటించి అభ్యంతరాలు స్వీకరించే విధానాన్ని అమలు చేస్తోందన్నారు. తొలి విడతలో ఒక్కో నియోజకవర్గంలో 480 ఇళ్ల చొప్పున నిర్మాణాలు చేపడుతున్నామని, పలుచోట్ల టెండర్లు, ఒప్పంద ప్రక్రియలు ఇప్పటికే పూర్తయ్యాయని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో తొలి దశలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి ఒక్కో ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని, రెండో దశలో మరో 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. హైదరాబాద్ పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా టవర్స్ కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. రాబోయే రెండున్నరేళ్లలో 'క్యూర్' ప్రాంతంలోని అర్హులైన పేదలకు రెండో, మూడో, నాలుగో, ఐదో విడతలుగా ఇళ్లు అందిస్తామని హామీ ఇచ్చారు. రాయదుర్గం ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసి వచ్చే బోనాల నాటికి ఇక్కడి నుంచే లబ్ధిదారులతో బోనాలు ఎత్తించేలా పనులు చేపడతామని పొంగులేటి చెప్పారు. నిర్మాణ నాణ్యతలో రాజీపడబోమని స్పష్టం చేశారు. లబ్ధిదారులు వారానికి ఒకసారి వచ్చి తమ ఇళ్ల నిర్మాణాన్ని స్వయంగా పరిశీలించవచ్చని, లోపాలు కనిపిస్తే అక్కడే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. వాటిని పరిష్కరించే బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. గతంలో పేదలకు నగరానికి 30-40 కిలోమీటర్ల దూరంలో ఇళ్లు నిర్మించారని పొంగులేటి విమర్శించారు. తమ ప్రభుత్వం మాత్రం ఖరీదైన ప్రాంతాల్లోనే పేదలకు సొంతింటి హక్కు కల్పిస్తోందన్నారు. పేదల ఇళ్ల కార్యక్రమాన్ని రాజకీయ విమర్శలకు ఉపయోగించడం సరికాదని, గత ప్రభుత్వ హామీలు, అమలుపై ప్రజలే నిర్ణయం తీసుకున్నారని వ్యాఖ్యానించారు.

# 22ఏ నిషేధిత జాబితా వివాదం

## తెలంగాణ ప్రభుత్వానికి ఎన్‌హెచ్‌ఆర్సీ నోటీసులు

## ప్రైవేట్ భూములను నిషేధిత జాబితాలో చేర్చడంపై స్వతంత్ర విచారణకు ఆదేశం

## నాలుగు వారాల్లో సమగ్ర నివేదిక సమర్పించాలని సీఎస్‌కు స్పష్టీకరణ

**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (సమయం న్యూస్):** తెలంగాణలో రిజిస్ట్రేషన్ చట్టం పరిధిలోని '22ఏ' నిషేధిత జాబితాలో ప్రైవేట్ వ్యక్తుల భూములను, పట్టా స్థలాలను చేర్చిన వ్యవహారంపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్సీ) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ అంశంపై తక్షణమే స్వతంత్ర విచారణ చేపట్టి, బాధితులకు ఉపశమనం కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సోమవారం ఆదేశించింది. విచారణ పురోగతి, తీసుకున్న చర్యలపై నాలుగు వారాల్లోగా సమగ్ర నివేదికను సమర్పించాలని స్పష్టం చేసింది.

### రాజ్యాంగ హక్కుల ఉల్లంఘనపై ఫిర్యాదు:

హైదరాబాద్‌కు చెందిన న్యాయవాది, సామాజికవేత్త కారు-పోతుల రేవంత్ సెప్టెంబర్ 14న దాఖలు చేసిన ఫిర్యాదుపై ఎన్‌హెచ్‌ఆర్సీ స్పందించింది. ధరణి పోర్టల్ నుంచి నూతన 'భూ భారతి' విధానానికి మార్పు చెందే క్రమంలో, ఎలాంటి ముందస్తు నోటీసులు లేదా గెజిట్ నోటిఫికేషన్లు లేకుండానే లక్షలాది ప్రైవేట్ పట్టా భూములను అధికారులు ఏకపక్షంగా 22ఏ నిషేధిత జాబితాలో చేర్చారని ఫిర్యాదుదారు పేర్కొన్నారు. దీనివల్ల ఆస్తుల రిజిస్ట్రేషన్లు, బ్యాంక్ రుణాలు, భూ లావాదేవీలు నిలిచిపోయి సామాన్య ప్రజలు తీవ్ర ఆర్థిక నష్టంతో పాటు మానసిక క్షోభ అనుభవిస్తున్నారని ఎన్‌హెచ్‌ఆర్సీ దృష్టికి తీసుకెళ్లారు. ఫిర్యాదును పరిశీలించిన కమిషన్.. ప్రజల జీవించే హక్కు (ఆర్టికల్ 21), సమానత్వ హక్కు (ఆర్టికల్ 14), వృత్తి-వ్యాపార నిర్వహణ హక్కు ౹ఆర్టికల్ 19(1)(జీ)౹ మరియు ఆస్తి హక్కు (ఆర్టికల్ 300-ఏ) వంటి ప్రాథమిక, రాజ్యాంగ హక్కుల ఉల్లంఘన కోణంలో ఈ విషయాన్ని




తీవ్రంగా పరిగణించింది. ప్రైవేట్ వ్యక్తుల భూములు ఈ నిషేధిత జాబితాలోకి ఎలా వచ్చాయి? నిర్ణయాత్మక ప్రక్రియలో అధికారుల వైపు నుంచి ఏమైనా లోపాలు లేదా అక్రమాలు చోటుచేసుకున్నాయా? అనే అంశాలపై నిష్పాక్షికంగా విచారణ జరపాలని ఎన్‌హెచ్‌ఆర్సీ ఆదేశించింది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం 22ఏ సమస్యల పరిష్కారానికి ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసి, జిల్లాల కలెక్టర్లకు దిశానిర్దేశం చేసినప్పటికీ, తాజా ఎన్‌హెచ్‌ఆర్సీ ఆదేశాలతో ఈ ప్రక్రియపై తక్షణ విచారణ నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# ట్యాంక్‌బండ్‌పై మళ్లీ ఉద్రిక్తత

## హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనానికి బారికేడ్లు తొలగించిన ఉత్సవ సమితి

## పోలీసుల ఆంక్షలను వ్యతిరేకించిన భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి



**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (సమయం న్యూస్):** వినాయక నిమజ్జనోత్సవాల వేళ ట్యాంక్‌బండ్‌పై మరోసారి ఉద్రిక్తత నెలకొంది. హుస్సేన్‌సాగర్‌లో విగ్రహాల నిమజ్జనాన్ని అడ్డుకునేందుకు పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు ఏర్పాటు చేసిన ఇనుప బారికేడ్లను భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు తొలగించారు. అనంతరం శోభాయాత్రగా వచ్చిన పలువురు హుస్సేన్‌సాగర్‌లో విగ్రహాలను నిమజ్జనం చేయడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. శతాబ్దాలుగా కొనసాగుతున్న నిమజ్జన సంప్రదాయాన్ని నిలిపివేయడం ద్వారా భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిమజ్జనానికి అడ్డుగా ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్స్, బారికేడ్లను తొలగించారు. నిమజ్జనోత్సవాల చివరి ఘట్టం సజావుగా సాగేందుకు ట్యాంక్‌బండ్‌పై ఆంక్షలను ఎత్తివేసి వాహనాలను అనుమతించాలని డిమాండ్ చేశారు. హుస్సేన్‌సాగర్‌లో కాలుష్యాన్ని తగ్గించేందుకు తెలంగాణ హైకోర్టు గతంలో పలు ఆదేశాలు జారీ చేసింది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనం చేయకుండా చర్యలు తీసుకోవాలని, పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి విగ్రహాలకు మాత్రమే అనుమతి ఇవ్వాలని స్పష్టం చేసింది. ఇతర విగ్రహాలను బేబీ పాండ్స్, ఎన్టీఆర్ మార్గ్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన నిమజ్జన కేంద్రాల వైపు తరలించాలని సూచించింది. ఈ నేపథ్యంలోనే ట్యాంక్‌బండ్ ప్రధాన రహదారి నుంచి హుస్సేన్‌సాగర్‌లోకి విగ్రహాలను తీసుకెళ్లకుండా అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఉత్సవ సమితి నేతలు బారికేడ్లను తొలగించడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ట్యాంక్‌బండ్ పరిసరాల్లో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తో పాటు అదనపు పోలీసు బలగాలను మోహరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టారు. కోర్టు ఆదేశాలు, ప్రభుత్వ సూచనలను పాటించాలని, నిబంధనలు ఉల్లంఘించవద్దని పోలీసులు ఉత్సవ సమితి నేతలకు సూచించారు.

# జూరాల ఎడమ కాలువ వద్ద ఉద్రిక్తత

- పోలీసుల లాఠీఛార్జ్, మాజీ ఎమ్మెల్యే చిట్టెం అరెస్టు
- ఎండిపోతున్న పంటలను కాపాడుకునేందుకు కాలువలోకి దిగి రైతుల ఆందోళన
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా సాగునీటి పోరాటం






**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 21 (సమయం న్యూస్):** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సాగునీటి కోసం అన్నదాతలు చేస్తున్న పోరాటం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఎండిపోతున్న పంటలను కాపాడుకోవడానికి జూరాల ప్రాజెక్టు ఎడమ కాలువకు వెంటనే నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు చేపట్టిన ఆందోళన మంగళవారం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. అమరచింత మండల పరిధిలోని జూరాల ఎడమ కాలువ వద్దకు రైతులు చేరుకోకుండా పోలీసులు భారీగా మోహరించి అడుగడుగునా అడ్డుకున్నారు.

### పోలీసుల లాఠీఛార్జ్ - మాజీ ఎమ్మెల్యే అరెస్టు

రైతుల నిరసనకు మద్దతుగా జూరాల ప్రాజెక్టు వద్దకు చేరుకున్న మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్ రెడ్డిని పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర తోపులాట జరిగింది. పోలీసులు చిట్టెం రాంమోహన్ రెడ్డిని ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో ఆగ్రహించిన రైతులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీఛార్జ్ చేయడంతో పరిస్థితి చేయిదాటింది. పోలీసులు ప్రధాన రహదారులపై అడ్డంకులు ఏర్పాటు చేసినప్పటికీ, అన్నదాతలు పొలాల వెంబడి కిలోమీటర్ల మేర నడుచుకుంటూ ప్రాజెక్టు వద్దకు చేరుకున్నారు.

### ప్రాణాలను తెగించి కాలువలోకి దిగిన రైతులు

పంట పొలాలకు నీళ్లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పలువురు రైతులు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సమాంతర కాలువలోకి దిగి, జూరాల ఎడమ కాలువ రెగ్యులేటర్ వైపు నడుచుకుంటూ వెళ్లేందుకు ప్రయత్నించడం స్థానికులను తీవ్రంగా కలచివేసింది. ఆందోళన తీవ్రతరం కావడంతో రక్షణ చర్యల్లో భాగంగా పోలీస్ బలగాలు జూరాల ప్రాజెక్టును పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. ఆందోళనలకు పిలుపునిచ్చిన ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకులు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలను జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడే ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు.

### జిల్లా వ్యాప్తంగా పతాక స్థాయికి చేరిన నిరసనలు

ఒక్క జూరాల మాత్రమే కాకుండా కోయిల్ సాగర్, సంగంబండ రిజర్వాయర్ల కాలువలకు కూడా వెంటనే సాగునీరు విడుదల చేయాలని రైతులు పట్టుబడుతున్నారు. శ్రీశైలం ప్రాజెక్టులో దాదాపు 100 టీఎంసీల నీరు అందుబాటులో ఉన్నప్పటికీ ప్రభుత్వం ఎత్తిపోయకపోవడం వల్ల ఆ నీరంతా దిగువన ఆంధ్ర ప్రాంతానికి తరలిపోతోందని, స్థానిక రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆందోళనకారులు మండిపడుతున్నారు. ఇరిగేషన్ అధికారులు తక్షణమే స్పందించి సాగునీటి విడుదలపై స్పష్టమైన ప్రకటన చేయకపోతే ఆందోళనలను మరింత తీవ్రతరం చేస్తామని రైతాంగం హెచ్చరించింది.

# ఉత్సవ సమితి సభ్యుల అరెస్టు దుర్మార్గం

- వినాయక నిమజ్జనం సమస్యను పరిష్కరించాలి
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 21 (సమయం న్యూస్) :** హైదరాబాద్‌లో వినాయక నిమజ్జనం ఏర్పాట్లను పెంచాలని డిమాండ్ చేస్తున్న భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి పదాధికారులు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేయడాన్ని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. గణేశ్ నిమజ్జనానికి సంబంధించిన సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాల్సిన ప్రభుత్వం ఉత్సవ సమితి సభ్యులను అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. భాగ్యనగరంలో గణేశ్ ఉత్సవాల నిర్వహణ మొదలుకుని నిమజ్జనం వరకు క్రమశిక్షణతో కూడిన వ్యవస్థను ఏర్పాటు చేయడంలో భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి 47 ఏళ్లుగా కీలకపాత్ర పోషిస్తోందని తెలిపారు. ప్రభుత్వానికి, పోలీసులకు, వివిధ శాఖలకు సహకరిస్తూ లక్షలాది మంది భక్తులు పాల్గొనే నిమజ్జనోత్సవాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు పనిచేస్తోందన్నారు. ఈసారి కూడా నగరవ్యాప్తంగా దాదాపు 1,40,000 గణేశ్ విగ్రహాలను ప్రతిష్ఠించారని తెలిపారు. ఈనెల 25న జరిగే ప్రధాన నిమజ్జనోత్సవానికి లక్షలా మంది భక్తులు తరలివస్తారని, ఇంతటి భారీ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై ప్రభుత్వం చాలా ముందుగానే స్పష్టత ఇవ్వాల్సి ఉందని అన్నారు. ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనానికి సంబంధించిన అంశాన్ని గణేశ్ ఉత్సవ సమితి ముందుగానే ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లిందని, అయినా ప్రభుత్వం సరైన సమయంలో చర్చించి అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపడంలో విఫలమైందని విమర్శించారు. న్యాయపరమైన అంశాలు ఉన్నప్పుడు వాటిని ముందుగానే పరిశీలించి చట్టపరిధిలో ఏం చేయవచ్చో నిర్ణయించి, ఉత్సవ సమితితో చర్చించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. కానీ నిమజ్జనోత్సవానికి కొద్ది రోజుల ముందు ఆంక్షలు విధించడం సమస్యకు పరిష్కారం కాదన్నారు. పెద్ద సంఖ్యలో, భారీ విగ్రహాల నిమజ్జనానికి అవసరమైన క్రేన్లు, ట్రాఫిక్ నిర్వహణ, శాంతిభద్రతల అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు. భక్తుల మనోభావాలను గౌరవించాలని, ఉత్సవ సమితితో ఘర్షణకు దిగడం, అరెస్టులతో సమస్యను అణచివేయాలని చూడడం సరైన విధానం కాదని హితవు పలికారు. ప్రభుత్వం పరిస్థితిని జఠిలం చేసేలా వ్యవహరించకూడదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరిని వీడి భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధులతో వెంటనే చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. న్యాయపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకుంటూనే భక్తుల మనోభావాలను గౌరవిస్తూ భారీ విగ్రహాల నిమజ్జనానికి ఆచరణాత్మకమైన ఏర్పాట్లు చేయాలన్నారు. గణేశ్ నిమజ్జనోత్సవం ప్రశాంతంగా, సజావుగా, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తయ్యేలా ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కిషన్‌రెడ్డి కోరారు.

# ఎర్రవల్లిలో కొనసాగిన భూ సర్వే

- పాస్ పుస్తకాలు, నోటీసులతో రైతుల హాజరు
- సర్వే నంబర్ 325లో కొనసాగుతున్న సమగ్ర భూ కొలతలు
- పాండురంగ చెరువు నిర్మాణంతో భూమి కోల్పోయామంటున్న బాధితులు
- న్యాయం చేయాలని వేడుకోలు
- క్షేత్రస్థాయిలో పరిశీలించిన రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ శమీనా బేగం



**మర్కుక్, సెప్టెంబర్ 21 (సమయం న్యూస్) :** మర్కుక్ మండలం ఎర్రవల్లి గ్రామంలో సర్వే నంబర్ 325లో గల 388.05 గుంటల ప్రభుత్వ భూమిపై చేపట్టిన సమగ్ర భూ సర్వే సోమవారం కూడా కొనసాగింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం,రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో శనివారం ఎర్రవల్లి గ్రామంలో సర్వే నంబర్ 325లో సాగు చేస్తున్న వంద మంది రైతులకు తొలి విడత నోటీసులు జారీ చేసి,సోమవారం తమ భూముల హద్దులు చూపించాలని ఆదేశించడంతో రైతులు ఉదయం నుంచే తమ పట్టాదార్ పాస్ బుక్ లు నోటీసులు,ఇతర రెవెన్యూ రికార్డులతో తమ భూముల వద్దకు చేరుకున్నారు.ఏడీ సుదర్శన్ రాథోడ్,డీఐ సేవ్య నాయక్ ఆధ్వర్యంలో నాలుగు బృందాలుగా ఏర్పడిన సర్వే అధికారులు రైతులు చూపిస్తున్న హద్దుల ప్రకారం,రెవెన్యూ రికార్డుల ప్రకారం కొలతలు చేపట్టి వివరాలను నమోదు చేశారు.సోమవారం నాటికి సుమారు 70ఎకరాల వరకు సర్వే పూర్తి అయినట్లు అధికారులు తెలిపారు.ఎర్రవల్లి గ్రామంలో కొనసాగుతున్న సర్వేను రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ శమీనా బేగం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె సర్వే పనులు జరుగుతున్న తీరును,భూముల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.సర్వేలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా కచ్చితమైన కొలతలతో,పారదర్శకంగా నిర్వహించాలని ఆమె అధికారులకు సూచించారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని,అందరికీ న్యాయం జరిగేలా సర్వే చేయాలని ఆమె ఆదేశించారు.అలాగే సోమవారం రోజున మరో 50 మంది రైతులకు నోటీసులు జారీ చేశామని అధికారులు తెలిపారు. గత మూడు రోజులుగా ఈ భూమికి హద్దులు ఏర్పాటు చేస్తున్న అధికారులు ప్రస్తుతం ఎవరి భూమి ఎంత ఉంది, ఎంత ఆక్రమణలో ఉంది.. ఎంత ఖాళీగా ఉంది అనే అంశాలపై క్షేత్ర స్థాయిలో పరిశీలన చేస్తున్నారు. కాగా, ఈ సర్వేలో రైతుల ఆవేదన కూడా బయటపడింది. ఇదే సర్వే నంబర్ పరిధిలో గత ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా పాండురంగ చెరువును నిర్మించారని, ఆ చెరువు నిర్మాణంలో రైతులు ఏళ్లుగా సాగు చేసుకుంటున్న దాదాపు 80 ఎకరాల సాగు భూమి పూర్తిగా కోల్పోయామని రైతులు వాపోతున్నారు. తద్వారా పండించుకునే భూమే లేకుండా పోయిందని.. ఇప్పుడు అదే భూములకు తమకు నోటీసులు రావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని అంటున్నారు. 'మా భూమి అంతా పాండురంగ చెరువులో పోయింది.. ఇప్పుడు మాకు నోటీసులు వచ్చాయి.. భూమే లేనప్పుడు మేము అధికారులకు ఏ భూమి చూపించాలం'టూ కొంతమంది రైతులు అధికారులను, సర్వేయర్లను ప్రశ్నిస్తున్నారు. శనివారం నోటీసులు అందుకుని సోమవారం పొలాల వద్దకు వచ్చిన రైతులు తమ భూములు చెరువు నీటిలో కలిసిపోయాయని, చూపించడానికి తమ వద్ద భూమే లేదని కన్నీటితో సమాధానమిచ్చారు. పాండురంగ చెరువు నిర్మాణంతో నష్టపోయిన తమకు న్యాయం చేయాలని, తమ భూములకు సరైన పరిహారం కల్పించాలని లేదా ప్రత్యామ్నాయ భూమిని చూపించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. సర్వే పూర్తయ్యాక నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించి తదుపరి న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు.



# జర్నలిస్టులు టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

### మీడియా అకాడమి చైర్మన్ .శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (సమయం న్యూస్) :** జర్నలిస్టులు కూడా ఏఐ పరిజ్ఞానాన్ని తప్పనిసరిగా పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమీ భవనంలో కృత్రిమ మేధలో టూల్స్ అండ్ టెక్నిక్స్ వర్క్‌షాప్‌ను మీడియా అకాడమీ, డాటా లీడ్స్, గూగుల్ న్యూస్ ఇనిషివేటివ్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ప్రముఖ దినపత్రికలు, టీవీ ఛానల్స్‌కు చెందిన తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషలకు సంబంధించిన జర్నలిస్టులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులు కూడా వృత్తిలో భాగంగా డిజిటల్ మీడియా, సోషల్ మీడియాలో ఏఐని జర్నలిస్టులు ఉపయోగించుకొని రిపోర్టింగ్‌లో సులభతరమైన పద్ధతులను పాటించి తక్కువ సమయంలోనే ఎక్కువ అంశాలను పాఠకులకు, వీక్షకులకు అందించవచ్చునని అన్నారు. రిసోర్స్ పర్సన్ ఉడుముల సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టు కూడా నిత్య విద్యార్థిలాగా ఉండాలన్నారు. అదేవిధంగా తాను కూడా నిత్యం ఏదో ఒకటి నేర్చుకుంటూ నిత్య విద్యార్థిగానే కొనసాగుతున్నానని చెప్పారు. శిక్షణలో భాగంగా ఏఐ టూల్స్ ఉపయోగాలు, ప్రమాదాలు, ఏఐ పద్ధతులు, నియమ నిబంధనలు, ప్రాథమిక అంశాల గురించి వివరించారు. కృత్రిమ మేధ జర్నలిస్టుల వృత్తిలో భాగంగా తప్పనిసరి అయిందన్నారు. చాట్ జీపీటి, పెర్ప్లెక్సిటీ, నోట్ బుక్ ఎలఎం, గూగుల్, జమినై, మిడ్ జర్నీ, సోరా, విఇఓ3, తదితర టూల్స్ ని పరిచయం చేసి జర్నలిస్టులు ఎలా ఉపయోగించాలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్, ఉదాహరణల ద్వారా అవగాహన కలిగించారు. ఏఐ డాటా ట్రైయినింగ్‌లో వినియోగంలో లోపం వల్ల, ప్రామ్టింగ్ ఇంజనీరింగ్ సరిగా చేయకపోవడం వల్ల వివక్ష లేదా తప్పుడు సమాచారం వ్యాప్తి చెందుతుందన్నారు. కార్యక్రమంలో మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# నేడు జూరాలను సందర్శించనున్న బీజేపీ బృందం

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు



**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (సమయం న్యూస్)** :జూరాల ప్రాజెక్టులోని నీటిమట్టాన్ని పరిశీలించి రైతుల సమస్యలను తెలుసుకునేందుకు తన నేతృత్వంలోని బీజేపీ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం మంగళవారం జూరాల ప్రాజెక్టును సందర్శించనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు తెలిపారు. ప్రజల సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే బీఆరఎస్, కాంగ్రెస్‌లు డ్రామాలు ఆడుతున్నాయని విమర్శించారు. వరంగల్‌కు చెందిన ఐటీడీపీ ప్రాజెక్టు విశ్రాంత అధికారితోపాటు పలువురు ప్రముఖులకు పార్టీ కండువాలు కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. అనంతరం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పంటలను కాపాడేందుకు జూరాల ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసేలా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక నాయకుల మధ్య వివాదాలు, సరైన సమన్వయం లేకపోవడం వల్ల దిగువ ప్రాంత రైతులు నష్టపోతున్నారన్నారు. కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వంతో మాట్లాడి ఆలమట్టి, నారాయణపూర్ డ్యామ్‌ల నుంచి నీటి విడుదలను తెలంగాణ ప్రభుత్వం నిర్ధారించుకోవాలని కోరారు. ఫామ్‌హౌస్ వివాదాల్లో కేసులు ఎందుకు నమోదు చేయడం లేదని ప్రశ్నించారు. వినాయక నిమజ్జన ఊరేగింపు ఏర్పాట్లకు పోలీసు బలగాలను ఉపయోగించకుండా ఎర్రవల్లి ఫామ్‌హౌస్ చుట్టూ మోహరించి ప్రభుత్వం పోలీసు శాఖను దుర్వినియోగం చేస్తోందని మండిపడ్డారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సభ్యుల అరెస్టును తీవ్రంగా ఖండించారు. సంప్రదాయం ప్రకారం హుస్సేన్‌సాగర్‌లో గణేష్ విగ్రహాల నిమజ్జనానికి అనుమతితోపాటు అన్ని ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. 70 అడుగుల ఎత్తైన విగ్రహాలు సహా భారీ విగ్రహాలను బ్యాక్‌వాటర్‌కు మళ్లించకుండా ట్యాంక్‌బండ్‌లోనే నిమజ్జనం చేయడానికి అనుమతించాల్సిందేనని స్పష్టం చేశారు. 2019 నుంచి బీఆరఎస్ పాలనలో తెలంగాణలో పీఎం ఫసల్ బీమా యోజన అమలు కాకపోవడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే తమ మేనిఫెస్టోలో హామీ ఇచ్చినప్పటికీ పంట బీమాను అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలమైందని ధ్వజమెత్తారు. రాష్ట్ర రైతాంగ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఫసల్ బీమా యోజనను ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. ఎల్‌నినో పరిస్థితుల వల్ల పంట నష్టపోయిన రైతులకు సరైన సమయంలో బీమా అందక తీవ్ర నిరాశకు గురవుతున్నారని రామచందర్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు.

# దానం పిటిషన్‌పై రేపు విచారణ



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 21 (సమయం న్యూస్):** తనపై అనర్హత వేటు వేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే ఇవ్వాలని కోరుతూ ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు అనుమతించింది. పార్టీ ఫిరాయింపుల కేసులో హైకోర్టు తనపై విధించిన అనర్హత వేటును సవాల్ చేస్తూ ఆయన సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దానం తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి సుప్రీంకోర్టులో సోమవారం మెన్షన్ చేశారు. ఈ పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం ఈనెల 23న విచారణ చేపట్టనుంది. హైకోర్టు తీర్పుపై స్టే ఇవ్వాలని కోరుతూ దానం నాగేందర్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు.



# చరిత్రను విస్మరిస్తే.. వర్తమానం అర్థం కాదు!

**సామ్రాజ్యాల పతనమే ప్రపంచ పటాన్ని మార్చింది**

**మధ్యప్రాచ్య సంక్షోభాలకు శతాబ్దాల చరిత్ర నేపథ్యం**

**యుద్ధాలు కూల్చిన సామ్రాజ్యాలు.. పుట్టుకొచ్చిన కొత్త దేశాలు**

**వలస పాలన నుంచి అగ్రరాజ్యాల ఆధిపత్యం దాకా మారిన ప్రపంచం**

**భారత్‌కు సమతుల్య దౌత్యమే కీలకమన్న చరిత్ర పాఠం**

గతాన్ని అధ్యయనం చేయకుండా వర్తమానాన్ని పూర్తిగా అర్థం చేసుకోవడం సాధ్యం కాదు. తత్వవేత్త జార్జ్ శాంటాయానా 1905లో వెలువరించిన ది లైఫ్ ఆఫ్ రీజన్‌లో గతాన్ని గుర్తుంచుకోని వారు దానిని మళ్లీ అనుభవించే ప్రమాదం ఉందనే భావనను ప్రతిపాదించారు. నేటి ప్రపంచంలో కొనసాగుతున్న అనేక ఘర్షణల వెనుక దశాబ్దాలు, కొన్ని సందర్భాల్లో శతాబ్దాల నాటి రాజకీయ పరిణామాలు ఉన్నాయి. ఇరాన్–అమెరికా––ఇజ్రాయెల్ మధ్య నేటి ఉద్రిక్తతలను కూడా ఒక్క సంఘటనతో వివరించడం సాధ్యం కాదు. ఒట్టోమన్ సామ్రాజ్యం పతనం, బ్రిటిష్ పాలనలో పాలస్తీనా, బాల్ఫోర్ ప్రకటన, ఇజ్రాయెల్ ఆవిర్భావం మధ్యప్రాచ్య రాజకీయ భౌగోళిక స్వరూపాన్ని మార్చిన కీలక ఘట్టాలు. అయితే ప్రస్తుత ఇరాన్–అమెరికా–ఇజ్రాయెల్ సంఘర్షణకు ఒట్టోమన్ సామ్రాజ్యం పతనమే ప్రత్యక్ష కారణమని చెప్పడం చారిత్రకంగా అసంపూర్ణం. అమెరికా––ఇరాన్ విభేదాలకు 1953లో ఇరాన్ ప్రధాని మహమ్మద్ మొసద్దెగ్‌ను తొలగించిన తిరుగుబాటులో అమెరికా, బ్రిటన్ పాత్ర, 1979 ఇస్లామిక్ విప్లవం, అమెరికా రాయబార కార్యాలయ బందీ సంక్షోభం, తదనంతర ఆంక్షలు, అణు వివాదం వంటి పరిణామాలు మరింత ప్రత్యక్ష నేపథ్యంగా ఉన్నాయి. మొదటి ప్రపంచ యుద్ధానికి ముందు పాలస్తీనా ఒట్టోమన్ సామ్రాజ్యంలో భాగంగా ఉండేది. యుద్ధ సమయంలోనే 1917లో బ్రిటన్ బాల్ఫోర్ ప్రకటన ద్వారా పాలస్తీనాలో యూదు ప్రజలకు ఒక 'జాతీయ గృహం' ఏర్పాటుకు మద్దతు ప్రకటించింది. యుద్ధంలో ఒట్టోమన్ ఓటమి అనంతరం పాలస్తీనా బ్రిటిష్ ఆధీనంలోకి వెళ్లగా, 1922లో నానాజాతి సమితి బ్రిటన్‌కు అధికారిక మాండేట్ ఇచ్చింది. ఆ మాండేట్‌లో బాల్ఫోర్ ప్రకటన లక్ష్యం కూడా భాగమైంది. తర్వాతి దశాబ్దాల్లో యూదుల వలసలు పెరగడం, అరబ్ పాలస్తీనియన్ల స్వయం నిర్ణయాధికార డిమాండ్లు, పరస్పర ఘర్షణలు పరిస్థితిని మరింత సంక్లిష్టం చేశాయి. 1947లో ఐక్యరాజ్యసమితి పాలస్తీనాను అరబ్, యూదు రాజ్యాలుగా విభజించే ప్రణాళికను ప్రతిపాదించింది. 1948లో ఇజ్రాయెల్ ఏర్పాటైంది. అందువల్ల 'ఒట్టోమన్ సామ్రాజ్యం పతనమవకపోతే ఇజ్రాయెల్ ఉండేది కాదు' అనేది నిర్ధారించగల చారిత్రక వాస్తవం కాకుండా ఊహాత్మక వ్యాఖ్య మాత్రమే. 1914 నుంచి 1918 వరకు సాగిన మొదటి ప్రపంచ యుద్ధం ప్రపంచ రాజకీయ వ్యవస్థనే మార్చేసింది. రష్యా తొలుత బ్రిటన్, ఫ్రాన్స్‌తో కలిసి పోరాడినా 1917 విప్లవం అనంతరం యుద్ధం నుంచి వైదొలిగింది. యుద్ధం, విప్లవాలు, జాతీయవాద ఉద్యమాల ప్రభావంతో రష్యన్, ఒట్టోమన్, ఆస్ట్రో––హంగేరియన్ సామ్రాజ్యాలు అంతమయ్యాయి. బ్రిటిష్ సామ్రాజ్యం మాత్రం మొదటి ప్రపంచ యుద్ధంతో అంతం కాలేదు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత దాని ఆర్థిక, రాజకీయ శక్తి తీవ్రంగా బలహీనపడింది. భారత స్వాతంత్ర్య ఉద్యమం, వలస దేశాల్లో పెరిగిన జాతీయవాదం, యుద్ధానంతర అంతర్జాతీయ పరిస్థితులు సామ్రాజ్య విచ్ఛిన్నాన్ని వేగవంతం చేశాయి. 1947లో భారత్ స్వాతంత్ర్యం పొందడం ఈ ప్రక్రియలో అత్యంత కీలక ఘట్టం. ఇక్కడ మరో చారిత్రక సవరణ అవసరం. రాష్ట్రపతి భవన్‌ను 1933లో నిర్మించలేదు. అప్పటి వైస్రాయ్ హౌస్ నిర్మాణానికి పదిహేడేళ్లకు పైగా పట్టగా, చివరి రాయి 1929లో వేశారు. ఆ భవనంలోకి వైస్రాయ్ లార్డ్ ఇర్విన్ 1929 ఏప్రిల్ 6న ప్రవేశించినట్లు రాష్ట్రపతి భవన్ అధికారిక చరిత్ర పేర్కొంటోంది. ప్రతి సామ్రాజ్యం పతనానికి ఒకే కారణం లేదు. సైనిక విస్తరణతో పెరిగిన వ్యయం, ఆర్థిక ఒత్తిళ్లు, పరిపాలనా సమస్యలు, జాతీయవాద ఉద్యమాలు, స్వయం పాలన కోసం ప్రజల ఆకాంక్షలు, సాంకేతిక–సామాజిక మార్పులకు తగినట్లు వ్యవస్థలను మార్చుకోలేకపోవడం వంటి అంశాలు వివిధ స్థాయిల్లో ప్రభావం చూపాయి. మొదటి ప్రపంచ యుద్ధం ఈ బలహీనతలను మరింత తీవ్రం చేసి పలు సామ్రాజ్యాల పతనాన్ని వేగవంతం చేసింది. వాటి పతనంతో ప్రపంచ పటమే మారింది. ముఖ్యంగా మధ్యప్రాచ్యంలో ఒట్టోమన్ అనంతర సరిహద్దులు, మాండేట్ వ్యవస్థ, పాలస్తీనా ప్రశ్న నేటికీ ప్రభావం చూపుతున్నాయి. అదే సమయంలో ఉక్రెయిన్, భారత్–పాకిస్తాన్, పూర్వ యుగోస్లేవియా వంటి ప్రతి ఆధునిక వివాదాన్నీ కేవలం పాత సామ్రాజ్యాల పతనంతోనే వివరించడం కూడా సరైంది కాదు. ఒక్కో ప్రాంతానికి వేర్వేరు చారిత్రక, జాతీయ, మత, భౌగోళిక, రాజకీయ కారణాలు ఉన్నాయి. రెండో ప్రపంచ యుద్ధం అనంతరం ప్రత్యక్ష వలస సామ్రాజ్యాల యుగం క్రమంగా ముగిసింది. వాటి స్థానంలో సైనిక స్థావరాలు, ఆర్థిక శక్తి, సాంకేతిక ఆధిపత్యం, అంతర్జాతీయ సంస్థలు, దౌత్య పొత్తుల ద్వారా ప్రభావం చూపే అగ్రరాజ్యాల వ్యవస్థ బలపడింది. అమెరికా, సోవియట్ యూనియన్ ప్రచ్ఛన్న యుద్ధంలో రెండు ప్రధాన శక్తులుగా ఎదిగాయి. 1991లో సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమైన తర్వాత ప్రపంచ శక్తి సమీకరణాలు మరోసారి మారాయి. ఇటీవలి దశాబ్దాల్లో చైనా ఆర్థిక, సాంకేతిక, సైనిక సామర్థ్యాలను భారీగా విస్తరించింది. అయితే చైనా 'ప్రత్యక్ష యుద్ధానికి దూరంగానే ఉంటుంది' అనే సాధారణీకరణకు కూడా మినహాయింపులు, వివాదాస్పద అంశాలు ఉన్నాయి. ప్రపంచ శక్తుల ప్రవర్తనను ఒకే సూత్రంతో వివరించడం కంటే కాలానుగుణంగా వాటి చర్యలను పరిశీలించడం అవసరం. భారత్ ముందు ఉన్న సవాలు కూడా ఇదే. అమెరికా, రష్యా, చైనా, ఐరోపా దేశాలతో సంబంధాలను నిర్వహిస్తూనే పశ్చిమాసియా దేశాలతో ఆర్థిక, ఇంధన, వ్యూహాత్మక సంబంధాలను కొనసాగించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఏ ఒక్క శక్తి కేంద్రంపైనా పూర్తిగా ఆధారపడకుండా జాతీయ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని దౌత్య నిర్ణయాలు తీసుకోవడం కీలకం. చరిత్ర చెప్పే పాఠం సామ్రాజ్యాలు తప్పకుండా ఒకే విధంగా కూలిపోతాయనేది కాదు. అపరిమిత సైనిక విస్తరణ, ఆర్థిక భారాలు, మారుతున్న ప్రజాకాంక్షలను పట్టించుకోకపోవడం, రాజకీయ వ్యవస్థలను కాలానికి అనుగుణంగా మార్చుకోలేకపోవడం ఎంతటి శక్తినైనా బలహీనపరచగలవన్నదే చరిత్ర పదేపదే గుర్తుచేసే విషయం. అందుకే చరిత్ర అంటే గతించిన కాలపు కథ మాత్రమే కాదు. వర్తమానాన్ని అర్థం చేసుకునే అద్దం.. భవిష్యత్తును నిర్మించుకునే హెచ్చరిక.

# రామ మందిర విరాళాల చోరీ నిందితుల గుర్తింపు

- దర్యాప్తు దాదాపు పూర్తి చేసిన సిట్
- 25లోగా తొలి చార్జిషీట్ దాఖలు
- సీసీటీవీలో 105 చోరీ ఘటనలు
- ఎనిమిది మంది నిందితులు ఇప్పటికే అరెస్టు
- సుప్రీంకోర్టుకు సీల్డ్ కవర్‌లో నివేదిక



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 21 (సమయం న్యూస్):** అయోధ్య రామ మందిరంలో భక్తులు సమర్పించిన విరాళాల చోరీ కేసు దర్యాప్తు కీలక దశకు చేరుకుంది. ఈ వ్యవహారంలో ప్రమేయం ఉన్న వారిని గుర్తించామని, దర్యాప్తు దాదాపు పూర్తయిందని ప్రత్యేక దర్యాప్తు బృందం సుప్రీంకోర్టుకు తెలిపింది. సెప్టెంబర్ 25లోగా తొలి చార్జిషీట్‌ను దాఖలు చేయనున్నట్లు వెల్లడించింది. ఇప్పటివరకు ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు వార్తా కథనాలు పేర్కొంటున్నాయి. సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ వ్యవహారంపై విచారణ చేపట్టింది. సిట్ దర్యాప్తు పురోగతికి సంబంధించిన నివేదికను సీల్డ్ కవర్‌లో కోర్టుకు సమర్పించింది. ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వివరాలు వెల్లడించారు. తొలి అరెస్టు నుంచి 90 రోజుల గడువు సెప్టెంబర్ 25తో ముగియనున్నందున, అంతకుముందే చార్జిషీట్ దాఖలు చేయాల్సి ఉందని కోర్టుకు తెలిపారు. దర్యాప్తులో ఆలయ ప్రాంగణంలోని సీసీటీవీ దృశ్యాలను సిట్ క్షుణ్ణంగా పరిశీలించింది. విరాళాల చోరీకి సంబంధించిన 105 ఘటనలు సీసీటీవీ కెమెరాల్లో నమోదైనట్లు కోర్టుకు సమర్పించిన నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. సాక్షుల వాంగ్మూలాలు, విరాళాల లెక్కలు, రసీదులు, సంబంధిత పత్రాలు, ఎలక్ట్రానిక్ ఆధారాలను సిట్ సేకరించింది. స్వాధీనం చేసుకున్న నగదు, ఇతర వస్తువులను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లాకర్లలో భద్రపరిచినట్లు నివేదికలు వెల్లడించాయి. ఈ కేసులో దర్యాప్తును వేగంగా పూర్తి చేసి తార్కిక ముగింపునకు తీసుకెళ్లాలని సుప్రీంకోర్టు గతంలోనే ఆదేశించింది. జూలైలో ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటును పరిగణనలోకి తీసుకున్న సర్వోన్నత న్యాయస్థానం, దర్యాప్తు బృందంలో ఫోరెన్సిక్ ఆడిటర్‌ను కూడా చేర్చాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇదిలా ఉండగా శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ తొలి ముఖ్య కార్యనిర్వహణాధికారిగా రిటైర్డ్ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్ర ఇటీవల నియమితులయ్యారు. ఈ పదవికి మొత్తం 5,585 దరఖాస్తులు రాగా, బహుళ దశల ఎంపిక ప్రక్రియ అనంతరం మిశ్రను ఎంపిక చేసినట్లు ట్రస్ట్ వెల్లడించింది. తుది దశకు 16 మందిని ఎంపిక చేసి ఇంటర్వ్యూలు నిర్వహించగా, చివరకు ముగ్గురి పేర్లను పరిశీలించి జితేంద్ర మిశ్రకు బాధ్యతలు అప్పగించారు. సిట్ చార్జిషీట్ దాఖలు చేసిన తర్వాత విరాళాల చోరీ వెనుక ఉన్న పూర్తి వ్యవహారం, నిందితులపై మోపే అభియోగాలపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# బాలికపై వేధింపులు.. ముగ్గురి అరెస్టు

**పదో తరగతి విద్యార్థులకు వేధింపులు**

**వైరల్ వీడియోతో రంగంలోకి దిగిన పోలీసులు**

**పోక్సో సహా పలు సెక్షన్ల కింద కేసు**

**ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు**

**కఠిన చర్యలు తీసుకోవాలన్న రాహుల్ గాంధీ**





**జాముయ్, సెప్టెంబర్ 21 (సమయం న్యూస్):** బిహార్‌లోని జాముయ్ జిల్లాలో ఇద్దరు పదో తరగతి విద్యార్థులను అడ్డగించి వేధించిన ఘటన తీవ్ర కలకలం రేపింది. బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడడంతోపాటు ఆమె వెంట ఉన్న బాలుడిపైనా దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో పోలీసులు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసి ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. మిగిలిన నిందితుల కోసం గాలింపు కొనసాగుతోంది. సెప్టెంబర్ 19న రాత్రి 7 గంటల సమయంలో ఈ ఘటన జరిగినట్లు జాముయ్ ఎస్పీ విశ్వజీత్ దయాల్ తెలిపారు. ఇద్దరు విద్యార్థులు కోచింగ్‌కు వెళ్లిన అనంతరం ఆ ప్రాంతానికి వెళ్లగా కొందరు వారిని అడ్డుకున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. బాలికతో అసభ్యంగా ప్రవర్తించడంతోపాటు ఆమెను బలవంతంగా తీసుకెళ్లేందుకు ప్రయత్నించినట్లు వైరల్ వీడియోల్లో కనిపించింది. అడ్డుకునేందుకు ప్రయత్నించిన బాలుడిపైనా దాడి జరిగినట్లు పోలీసులు తెలిపారు. బాధితుల గోప్యత దృష్ట్యా వారి వివరాలను వెల్లడించలేదు. బాధితుల వాంగ్మూలాలను నమోదు చేసిన పోలీసులు పోక్సో చట్టంలోని సెక్షన్లు 8, 12తోపాటు భారతీయ న్యాయ సంహితలోని సంబంధిత సెక్షన్ల కింద జాముయ్ సదర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. వీడియోలో ఆరు నుంచి ఏడుగురు కనిపిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఇప్పటివరకు ముగ్గురిని అరెస్టు చేయగా, ఘటనపై సమగ్ర దర్యాప్తు కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు.

## 'ఇది మన సంస్కృతి కాదు'

ఈ ఘటనను లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా ఖండించారు. బాలిక ఎంతగా వేడుకున్నా ఆమెను వేధించే హక్కు ఎవరికీ లేదని పేర్కొన్నారు. వీడియోలో కనిపించిన ప్రతి ఒక్కరినీ గుర్తించి పోక్సో చట్టం కింద చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలు, బాలికల భద్రతపై బిహార్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని కోరారు. జాతీయ మహిళా కమిషన్ కూడా ఘటనను సుమోటోగా స్వీకరించింది. నిందితులందరినీ గుర్తించి చర్యలు తీసుకోవడంతోపాటు బాధితులకు భద్రత, న్యాయ సహాయం, మానసిక సహకారం అందించాలని బిహార్ పోలీసులను కోరింది. ఘటనకు సంబంధించిన వీడియోను మరింత వ్యాప్తి చేయకుండా చర్యలు చేపట్టాలని సూచించింది.

# డ్రగ్స్‌పై దేశవ్యాప్త ఉక్కుపాదం

- ఢిల్లీలో మూడో జాతీయ ఏఎన్‌టీఎఫ్ సదస్సు
- నేడు ప్రారంభించనున్న అమిత్ షా
- 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల చీఫ్‌ల హాజరు
- డ్రగ్ కార్టెల్స్ ఛేదింపుపై ప్రత్యేక దృష్టి
- డార్క్‌నెట్, క్రిప్టో లావాదేవీలపైనా చర్చ



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 21 (సమయం న్యూస్):** దేశంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగానికి అడ్డుకట్ట వేసే దిశగా కేంద్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేస్తోంది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల యాంటీ నార్కోటిక్స్ టాస్క్‌ఫోర్స్ చీఫ్‌ల మూడో జాతీయ సదస్సును సెప్టెంబర్ 22, 23 తేదీల్లో ఢిల్లీలో నిర్వహించనుంది. రెండు రోజుల సదస్సును కేంద్ర హోంమంత్రి అమిత్ షా మంగళవారం ప్రారంభించనున్నారు. మొత్తం 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఏఎన్‌టీఎఫ్ చీఫ్‌లతోపాటు సంబంధిత కేంద్ర ప్రభుత్వ విభాగాలు, ఇతర భాగస్వామ్య సంస్థల ప్రతినిధులు పాల్గొంటారు. 'సమష్టి సంకల్పం–ఉమ్మడి బాధ్యత' ఇతివృత్తంతో జరిగే ఈ సదస్సులో 2026–29 నార్కోటిక్స్ కంట్రోల్ విజన్ డాక్యుమెంట్‌లో నిర్దేశించిన లక్ష్యాల అమలును సమీక్షించనున్నారు. మాదకద్రవ్యాల సరఫరాను తగ్గించడం, వినియోగాన్ని నిరోధించడం, వాటివల్ల కలిగే నష్టాన్ని తగ్గించడం, కేంద్ర–రాష్ట్ర దర్యాప్తు సంస్థల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడంపై ప్రధానంగా చర్చించనున్నారు. దేశీయ, అంతర్జాతీయ డ్రగ్ కార్టెల్స్ నెట్‌వర్క్‌లను గుర్తించి ఛేదించడం, కొత్త రకాల సింథటిక్ డ్రగ్స్‌ను నియంత్రించడం, వాటి తయారీకి ఉపయోగించే రహస్య ప్రయోగశాలలను గుర్తించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. అక్రమ సాగును నిర్మూలించడం, ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించడం సహా మొత్తం ఎనిమిది సాంకేతిక సమావేశాలను నిర్వహించనున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని సాగుతున్న మాదకద్రవ్యాల అక్రమ వ్యాపారం కూడా సదస్సులో కీలక అంశం కానుంది. డార్క్‌నెట్ ద్వారా డ్రగ్స్ విక్రయాలు, క్రిప్టోకరెన్సీలతో జరిగే లావాదేవీలను గుర్తించడం, వాటిపై సమర్థంగా దర్యాప్తు చేయడం, డ్రగ్ నెట్‌వర్క్‌ల ఆర్థిక మూలాలను ఛేదించే వ్యూహాలపై చర్చించనున్నారు. సదస్సు ప్రారంభోత్సవం సందర్భంగా లఖ్‌నవూ, డెహ్రాడూన్‌లలో ఏర్పాటు చేయనున్న నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో జోనల్ సముదాయాలకు అమిత్ షా శంకుస్థాపన చేయనున్నారు. మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కోసం రూపొందించిన ప్రచార చిత్రాలను విడుదల చేయడంతోపాటు పునరుద్ధరించిన ఎన్‌సీబీ వెబ్‌సైట్‌ను ప్రారంభించనున్నారు. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో అత్యుత్తమ పనితీరు కనబరిచిన ఏఎన్‌టీఎఫ్‌ను సదస్సులో సత్కరించనున్నారు. మాదకద్రవ్యాలపై పోరులో నిఘా, దర్యాప్తు, సమాచార మార్పిడి, పునరావాసం, వివిధ సంస్థల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి 'డ్రగ్ ఫ్రీ ఇండియా' లక్ష్యం దిశగా కార్యాచరణను వేగవంతం చేయడం ఈ సదస్సు ప్రధాన ఉద్దేశమని కేంద్ర హోంశాఖ తెలిపింది.

# విద్యార్థుల ముందే టీచర్‌ను కాల్చి చంపిన వ్యక్తి..

**అక్కడే కాల్చుకుని ఆత్మహత్య**

**లక్నో:** ఒక వ్యక్తి స్కూల్‌కు వెళ్లాడు. ఒక ఉపాధ్యాయురాలిని కలిసిన అతడు తన వెంట తెచ్చిన తుపాకీతో కాల్పులు జరిపి ఆమెను హత్య చేశాడు. ఆ తర్వాత అతడు తనను తాను గన్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది చూసి ఆ స్కూల్ విద్యార్థులు, టీచర్లు షాక్ అయ్యారు. ఉత్తరప్రదేశ్‌లోని లఖింపూర్ ఖేరీలో ఈ సంఘటన జరిగింది. హిదాయత్ నగర్ నివాసి అయిన 26 ఏళ్ల నిషాత్ ఫాతిమా ఏడాదిగా లఖింపూర్ ఖేరీలోని చిల్డ్రన్స్ అకాడమీ స్కూల్‌లో టీచర్‌గా పని చేస్తున్నది. సోమవారం ఉదయం 11:30 గంటలకు ఆమెకు తెలిసిన 28 ఏళ్ల మహమ్మద్ సౌద్ ఆ స్కూల్‌కు చేరుకున్నాడు. కారిడార్‌లో ఫాతిమాను కలుసుకుని మాట్లాడాడు. ఉన్నట్టుండి బ్యాగ్ నుంచి తుపాకీ తీసి ఆ టీచర్‌పై కాల్పులు జరిపి హత్య చేశాడు. ఆ తర్వాత అక్కడే తనను తాను గన్‌తో కాల్చుకుని అతడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది చూసి ఆ స్కూల్ విద్యార్థులు, టీచర్లు భయాందోళన చెందారు. కాగా, ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆ స్కూల్‌కు చేరుకున్నారు. పిల్లలను స్కూల్ నుంచి వారి ఇళ్లకు పంపివేశారు. ఫోరెన్సిక్ బృందాన్ని రప్పించి ఆధారాలు సేకరించారు. ఆ తర్వాత టీచర్ ఫాతిమా, సౌద్ మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరోవైపు ఫాతిమా, సౌద్ చాలా కాలంగా ఒకరికొకరు తెలుసని, నిత్యం మాట్లాడుకునేవారని పోలీస్ అధికారిణి ఖ్యాతి గార్గ్ తెలిపారు. అయితే సౌద్ ఎందుకు ఆమెను కాల్చి చంపి ఆత్మహత్యకు పాల్పడ్డాడో అన్నది తెలియలేదని చెప్పారు. ఇరు కుటుంబాలతో పాటు, స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, ప్రత్యక్ష సాక్షులు, ఇతరులను విచారిస్తున్నట్లు పోలీస్ అధికారిణి వివరించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# సోషల్ మీడియాలో అనుచిత పోస్టు లు చేస్తే కఠిన చర్యలు

### జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS

**నారాయణపేట,సెప్టెంబర్,21(సమయం న్యూస్)** నారాయణపేట జిల్లా లో గణేష్ పండుగ, తాఖీ బాబా దర్గా ఉర్సు వేడుకలు ప్రశాంతంగా,సోదరభావంతో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు పోలీస్ శాఖ పటిష్టమైన భద్రతా చర్యలు చేపడు తోందని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ ఒక ప్రకటనలో మాట్లాడుతూ... మత విశ్వాసాలు, కులాలు, వర్గాలు, మత పెద్దలు లేదా ఇతర సముదాయాలను కించప రిచేలా,అవమానించేలా, రెచ్చగొట్టేలా సోషల్ మీడియాలో పోస్టులు, కామెంట్లు , వీడియోలు, ఫొటోలు లేదా మార్ఫింగ్




చేసిన చిత్రాలను ప్రచారం చేయడం, ఫార్వర్డ్ చేయడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు.జిల్లాలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పోలీస్ అధికారులు నిరంతరం సోషల్ మీడియాను పర్యవేక్షిస్తు న్నారని తెలిపారు. ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టే ఉద్దేశంతో తప్పుడు సమాచారం, పాత వీడియోలు, వదంతులు లేదా అభ్యంతరకరమైన కంటెంట్‌ను సోషల్ మీడియాలో వైరల్ చేసే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.మతపరమైన భావోద్వే గాలను దెబ్బతీసే పోస్టులు చేయవద్దు. ఇతర మతాలు, వర్గాలను కించపరిచే వ్యాఖ్యలు, మీమ్స్, వీడియోలు, ఫొటోలు షేర్ చేయవద్దు. మత విద్వేషాలను రెచ్చగొట్టే లేదా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే సమాచారాన్ని ఫార్వర్డ్ చేయవద్దు. నిజానిజాలు నిర్ధారించుకోకుండా ఎలాంటి వార్తలు, వీడియోలు, ఆడియోలను సోషల్ మీడియాలో ప్రచారం చేయవద్దు. ఇతరులు చేసిన అభ్యంతరకర పోస్టులను లైక్, షేర్, ఫార్వర్డ్ చేయడం ద్వారా వాటి ప్రచారానికి సహకరించవద్దు.సోషల్ మీడియాలో నకిలీ ఖాతాలు, మార్ఫింగ్ ఫొటోలు, తప్పుడు సమాచారం, రెచ్చగొట్టే పోస్టు లు, మతప రమైన విద్వేషాన్ని పెంచే కంటెంట్పై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని ఎస్పీ తెలిపారు. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా శాంతిభద్ర తలకు విఘాతం కలిగించే విధంగా సోషల్ మీడియాను ఉపయోగిస్తే, వారి పోస్టుల ఆధారంగా సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదు అని ఎస్పీ స్పష్టం చేశారు.

# నిమజ్జనం వేడుకగా.. ప్రజల భద్రత బాధ్యతగా..

- గణపతి నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలి... వేముల సాంబయ్య గౌడ్
- నిమజ్జనానికి ముస్తాబవుతున్న మాధన్నపేట చెరువు

**నర్సంపేట, సెప్టెంబరు 21 (సమయం న్యూస్) :** గణపతి నిమజ్జన వేడుకలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతా వరణంలో నిర్వహించి విజయవంతం చేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు, నర్సంపేట మున్సిపాలిటీ మాజీ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య గౌడ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ నెల 23న నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని మాదన్నపేట చెరువు కట్ట వద్ద నిర్వహించనున్న గణపతి నిమజ్జన కార్యక్రమాల నేపథ్యంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న పారిశుద్ధ్య, ఇతర ఏర్పాట్ల ను ఆయన సోమవారం పరిశీలించారు. నిమ జ్జనానికి వచ్చే గణనాథుల ఊరేగింపులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా సాగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని సాంబయ్య గౌడ్ కోరారు. ముఖ్యంగా చిన్నపిల్లలను నిమజ్జన ఊరేగింపులకు తీసుకురాకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని, పెద్దలు మద్యం సేవించి కార్యక్రమాల్లో పాల్గొనకుండా సంయమనం పాటించాలని సూచించారు. భక్తులు క్రమ శిక్షణతో, నియమనిష్ఠలతో వ్యవహరిస్తూ గణనాథుడికి వీడ్కోలు పలకాలన్నారు. నిమజ్జన ప్రదేశంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మున్సిపల్ సిబ్బంది పారిశుద్ధ్య పనులు, పరిసరాల శుభ్రత తదితర ఏర్పాట్లు చేపడుతున్నట్లు




తెలిపారు. నిమజ్జన కార్యక్రమం సజావుగా సాగేందుకు ప్రజలు మున్సిపాలిటీ సిబ్బందికి సహకరించాలని కోరారు. గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ప్రజలు, నిమజ్జనాన్ని కూడా అదే స్ఫూర్తితో ప్రశాంతంగా పూర్తి చేయాలని పిలుపు నిచ్చారు. గణనాథుడి ఆశీస్సులతో నర్సంపేట ప్రాంతంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలందరూ సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని సాంబయ్య గౌడ్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏరియా కౌన్సిలర్ ముత్తినేని వెంకటేశ్వర్లు , ఎన్ఎస్‌యూఐ పట్టణ అధ్యక్షుడు కటారి ఉత్తమ్‌కుమార్, మున్సిపాలిటీ జవాన్లు కందిక స్వామి, గోపగోని ప్రభాకర్, రమేష్, మహేందర్‌తో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను కొనసాగిద్దాం

- హ్యాండ్లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ దాసి శంకర్

**ఆలేరు, సెప్టెంబర్ 21(సమయం న్యూస్):** ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హ్యాండ్లూమ్ వీవర్స్ కోఆ పరేటివ్ సొసైటీ ఆలేరు చైర్మన్ దాసి శంకర్ పిలుపునిచ్చారు. కొండా లక్ష్మణ్ బాపూజీ 14వ వర్ధంతి సందర్భంగా ఆలేరు పట్టణంలోని హ్యాండ్లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ కార్యాలయం, కొండా లక్ష్మణ్ బాపూజీ ప్రాంగణంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దాసి శంకర్ మాట్లాడుతూ



కొండా లక్ష్మణ్ బాపూజీ తన జీవితాన్ని సమాజ సేవకు అంకితం చేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. స్వాతంత్ర్య పోరాటం, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేక ఉద్యమం, ప్రత్యేక తెలంగాణ ఉద్యమం.. ఇలా మూడు దశల ఉద్యమాల్లో ప్రముఖ పాత్ర పోషించి దేశ సేవకు అంకితమైన మహనీయుడని పేర్కొన్నారు. పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన బాపూజీ చేనేత కార్మికుల సంక్షేమం కోసం కూడా విశేషంగా కృషి చేశారని తెలిపారు. తెలంగాణ విముక్తి, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం తన మంత్రి పదవిని సైతం త్యాగం చేసిన గొప్ప వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ అని దాసి శంకర్ అన్నారు. ఆయన త్యాగాలు, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. బాపూజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంతో పాటు చేనేత రంగం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు చింతకింది మురళి, సంఘం కార్యదర్శి గాడిపెల్లి రమేష్, వైస్ చైర్మన్ చింతకింది రంగా, సహాయ కార్యదర్శి బింగి నర్సింహులు, డైరెక్టర్లు అందె రాములు, ఎలగందుల పద్మ, బేతి భాగ్య, మాజీ కార్యదర్శి ఎలగందుల రామారుషి, చేనేత నాయకులు చింతకింది రామానుజం, రచ్చ హన్మంతు, రేగోటీ వెంకటేష్, గుజ్జ అశోక్, చింతకింది సిద్ధులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ డివిజన్ కమిటీలకు బాధ్యుల నియామకం

- వర్ధన్నపేట నియోజకవర్గంలో కమిటీల ఏర్పాటుకు జిల్లా కాంగ్రెస్ కమిటీ కసరత్తు
- త్వరితగతిన కమిటీల ఏర్పాటు పూర్తి చేయాలి... డిసిసి అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి

**హనుమకొండ, సెప్టెంబరు 21 (సమయం న్యూస్) :** వర్ధన్నపేట నియో జకవర్గ పరిధిలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ కమిటీల ఏర్పాటును వేగవంతం



చేసేందుకు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ చర్యలు చేపట్టింది. ఆయా డివిజన్ల అధ్యక్షులతో సమన్వయం చేసుకుంటూ కమిటీల భర్తీ ప్రక్రియను పూర్తి చేసేందుకు వివిధ డివిజన్లకు జిల్లా కమిటీ సమన్వయక ర్తలను నియమిస్తూ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. స్థానిక ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు సూచన మేరకు ఈ నియామకాలు చేపట్టినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. 1, 65, 66 డివిజన్లకు ఈర్ల చిన్ని (ఉపాధ్యక్షులు), మారంరెడ్డి కౌథిల్ రెడ్డి (జనరల్ సెక్రటరీ), ముక్కెర సురేష్ (సెక్రటరీ). 2, 55, 56 డివిజన్లకు దొగ్గెల రాజేశ్వర్ రావు, మడికొండ సంపత్. 44, 45, 46, 64 డివిజన్లకు కొయ్యడ శ్రీనివాస్, శనిగరపు వీరేశ లింగం, పర్నెం తిరుపతి రెడ్డి లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ నియమితులైన సమన్వయ కర్తలు సంబంధిత డివిజన్ అధ్యక్షులతో సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యకలా పాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. డివిజన్ స్థాయిలో పార్టీని మరింత పటిష్ఠం చేసేలా నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ కమిటీల ఏర్పాటును వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కోరారు. కమిటీల నిర్మాణ ప్రక్రియలో సమన్వయకర్తలు క్రియాశీ లకంగా వ్యవహరించాలని సూచించారు.

# తాళ్లపల్లిలో హెచ్ఎండీఏ నిధులతో సీసీ రోడ్లు

**షాబాద్ సెప్టె ంబర్ 21: (సమయం న్యూస్)**
షాబాద్ మండలం తాళ్లపల్లి గ్రామంలో హెచ్ఎండీఏ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను సర్పంచ్ కందికంటి స్వాతి మాణిక్యం గౌడ్ ప్రారంభించారు. ఎమ్మెల్యే కృషితో నిధులు మంజూరయ్యాయని తెలిపారు. గ్రామంలో రహదారుల సమస్యను దశలవారీగా పరిష్కరిస్తామని, అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో రాజీపడబోమని సర్పంచ్ స్పష్టం చేశారు. ఈ ప్రారంభోత్సవంలో ఉప సర్పంచ్ అక్కముల అంజయ్య, వార్డు సభ్యులు , వివిధ కుల సంఘాల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# నేడు డయల్ యువర్ డిఎం కార్యక్రమం

### తాండూరు డిపో మేనేజర్ ప్రవీణ్ కుమార్

**తాండూరు మున్సిపల్, సెప్టెంబర్,21(సమయం న్యూస్)** వికారాబాద్ జిల్లా తాండూరు డిపో పరిధికి సంబంధించి (నేడు) మంగళవారం ఉదయం 11గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని డిపో మేనేజర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ప్రయాణికుల సమస్యలపై సెల్ నెంబరు cell- 9063469572 ఫోన్ చేయాలని కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.



# 50 ఏళ్ల వైద్య సేవలకు గుర్తింపు: డా.మురహరికి సన్మానం

### డాక్ట ర్ చింతకింది మురహరికి ఘన సన్మానం



**ఆలేరు, సెప్టెంబర్ 21(సమయం న్యూస్):** ఆలేరు పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు సుమారు 50 సంవత్సరాలుగా వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ చింతకింది మురహరికి వైద్య పండిత అవార్డు లభించిన సందర్భంగా ఘనంగా సన్మానించారు. దీర్ఘకాలంగా ప్రజలకు అందించిన వైద్య సేవలను గుర్తించి ఈ అవార్డు దక్కడం పట్ల పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో డాక్టర్ మురహరిని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ప్రజలకు నిబద్ధతతో వైద్య సేవలు అందిస్తూ నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతున్న ఆయన సేవలు అభినందనీయమని కార్యక్రమంలో పాల్గొన్న వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు కూతాటి అంజన్‌కుమార్, బీఆర్ ఎస్ నాయకులు మోతె వెంకటేష్, వి. మదార్, శ్రీశాంత్, సాగర్ హాస్పిటల్ సిబ్బంది భార్గవి, కళ్యాణి, అనూష తదితరులు పాల్గొన్నారు.

# లాహోటి కాలనీ గణేష్ మండపం దగ్గర సాంస్కృతిక కార్యక్రమం

### ముఖ్యఅతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్



**కొడంగల్, సెప్టెంబర్,21(సమయం న్యూస్)** లాహోటి కాలనీ గణేష్ మండపం దగ్గర సంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న నవీన ఆదర్శ హైస్కూల్ విద్యార్థులు..లాహోటి కాలనివాసులు భక్తులు ముందుగా గణపతి పూజ నిర్వహించి.. స్వామివారి దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే సంస్కృతిక కార్యక్రమాలు భాగంగా నవీన ఆదర్శ హైస్కూల్ విద్యార్థులు పాల్గొని సంస్కృతిక కార్యక్రమాన్ని విజయవంతం చేశారు ముఖ్యఅతిథిగా విచ్చేసిన కొడంగల్ మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ గారిచే సంస్కృతి కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో లాహోటి గణేష్ కమిటీ సభ్యులు, మహిళా కమిటీ సభ్యులు ,స్కూల్ ప్రిన్సిపాల్ డివి.నరేష్ రాజ్ ,వైస్ ప్రిన్సిపాల్ సంతోష, ఉపాధ్యాయ బృందం తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కొడంగల్ కడా కార్యక్రమంలో CMRF చెక్కుల పంపిణీ




**కొడంగల్ మున్సిపల్, సెప్టెంబర్,21(సమయం న్యూస్)** కొడంగల్: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొంటూ, ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) ద్వారా మంజూరైన చెక్కులను కొడంగల్ కడా కార్యాలయంలో కొడంగల్ నియోజకవర్గ ఇంచార్జి ఏ.తిరుపతి రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని కడా ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి,మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్, ప్రజాప్రతినిధులు,నాయకులతో కలిసి లబ్ధిదారులకు (సీఎం ఆర్ ఎఫ్)చెక్కులను అందజేశారు.అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఆర్థిక భరోసాగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు.ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో కొడంగల్ నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వ సహాయాన్ని అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు తమకు సహకరించిన కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు,తదితరులు పాల్గొన్నారు.

## BC/SC బాలికల పాఠశాల,కళాశాల వసతి గృహం లో పేరెంట్స్ మీటింగ్



- పాఠశాల మరియు కళాశాల వసతి గృహములో సత్ప్ర వర్తన క్రమశిక్షణ కలిగి ఉండాలి-
- హే డబ్ల్యూ ఓ(HWO) నిర్మల, వరలక్ష్మి

**కొడంగల్ మున్సిపల్(మం)సెప్టెంబర్ 21(సమయం న్యూస్)** వికారాబాద్ జిల్లా కొడంగల్ పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ BC/SC బాలికల పాఠశాల మరియు కళాశాల వసతి గృహం యందు విద్యార్థినుల తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులయొక్క సందేహాలను నివృత్తి చేస్తూ వారికి వసతి గృహం లో గల అన్ని వసతుల గురించి విద్యార్థులకు నేరుగా అందుతున్న మెనూ కాస్మెటిక్స్ గురించి క్లుప్తంగా వివరించడం జరిగింది. విద్యార్థినిలు అందరూ కూడా సమాజంలో, పాఠశాలలో కళాశాలలో సత్ప్రవర్తన క్రమశిక్షణ కలిగి ఉండాలి విద్యార్థులు వారి యొక్క తల్లిదండ్రులతో కలిపి సమావేశం అనంతరం హాజరైన తల్లిదండ్రులందరికీ భోజన వసతిని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో వసతి గృహ సంక్షేమ అధికారి నిర్మల వరలక్ష్మి సిబ్బంది తల్లి దండ్రులు పాల్గొన్నారు.

## కొడంగల్ లో గణనాథుని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి



**కొడంగల్ మున్సిపల్, సెప్టెంబర్,21(సమయం న్యూస్)**వినాయక చవితి సందర్భంగా వికారాబాద్ జిల్లా కొడంగల్ మున్సిపల్ రెండవ వార్డ్ లోని కూరగాయల మార్కెట్ లో బొడ్రాయి దగ్గర మరియు బాకారం బాల్ రెడ్డి ఇంటి దగ్గర మరియు వినాయక్ చౌరస్తా దగ్గర ఉన్న విఘ్నేశ్వరుని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసిన కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి ఈ కార్యక్రమంలో మున్సిపల్ రెండవ వార్డ్ మాజీ కౌన్సిలర్ ఆర్ మధుసూదన్ యాదవ్. బొంరాస్ పేట్ మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు కోట్ల యాదగిరి. దౌల్తాబాద్ మాజీ జెడ్పీటీసీ కోట్ల మైపాల్ ముదిరాజ్. దౌల్తాబాద్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బీములు యూత్ ప్రెసిడెంట్ నరేష్ గౌడ్ వర్కింగ్ ప్రెసిడెంట్ మడిగే శ్రీనివాస్ వి రవీంద్ర చారి తలారి వెంకట్ ముదిరాజ్ బాకారం బాల్ రెడ్డి తాండ్ర గౌరీ కోక్కల్ల చందు బండి గోపాల్ శివ రెడ్డి రాకేష్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన సర్పంచ్ ను పరామర్శించిన

### కొడంగల్ నియోజకవర్గ ఇంచార్జి ఏ.తిరుపతి రెడ్డి ,



**కొడంగల్ మండలం, సెప్టెంబర్,21(సమయం న్యూస్)** మండలంలోని అప్పాయిపల్లి గ్రామ సర్పంచ్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన బొడ్రాయి వెంకటయ్యని అప్పాయిపల్లి గ్రామంలో ని తన నివాసంలొ పరామర్శించిన కొడంగల్ నియోజకవర్గ ఇన్చార్జ్ తిరుపతి రెడ్డి మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ పార్టీ మండల అధ్యక్షుడు సంజీవరెడ్డి సీనియర్ నాయకులు ఎండి యూసుఫ్ ఉపాధ్యక్షుడు ఎస్ బాల్రాజ్ గ్రామ అధ్యక్షుడు సంగప్ప నాయకులు గోకుల్ సింగ్ ఉప సర్పంచ్ పకీరప్ప దత్తు సింగ్ కాశయ్య గౌడ్ జనార్దన్ బాలరాజ్ శేఖర్ సర్పంచులు కుమ్మరి శ్రీనివాస్ చెన్బస్ గ్రామస్తులు నాయకులు పరమర్శించారు.

## రూ.4.44 కోట్ల ప్రభుత్వ బియ్యం నష్టం.. 7 రోజుల్లో చెల్లించాలి.

- లేకుంటే ఆర్ఆర్ చట్టం కింద ఆస్తుల జప్తు, వేలం.
- తహసీల్దార్ కృష్ణమోహన్ హెచ్చరిక.

**రాయపోల్.సెప్టెంబర్(సమయం).21.**సిద్ధిపేట జిల్లా రాయపోల్ మండలం రామారం గ్రామంలోని మహదేవ్ ఆగ్రో రైస్ ఇండస్ట్రీస్ యాజమాన్యం ప్రభుత్వ వరి ధాన్యం నిల్వలను దుర్వినియోగం చేయడం వల్ల ప్రభుత్వానికి రూ.4,44,15,348 నష్టం వాటిల్లిందని తహసీల్దార్ కృష్ణమోహన్ తెలిపారు. ఈ మొత్తాన్ని ఏడు రోజుల్లోగా చెల్లించాలని సంబంధిత రైస్‌మిల్ యాజమానులకు నోటీసు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ స్టేట్ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ లిమిటెడ్ ఇచ్చిన నివేదికలు, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు, జిల్లా కలెక్ట ర్ కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపట్టి నట్లుతహసీల్దార్ తెలిపారు. ప్రభుత్వ ధాన్యం 12,708.90 క్వింటాళ్లు దుర్వినియోగమైనట్లు అధికారులు నిర్ధారించినట్లు నోటీసులో పేర్కొనడం జరిగిందన్నారు.మహదేవ్ ఆగ్రో రైస్ ఇండస్ట్రీస్ యజమానులకు ఈ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. నష్టపరిహారం మొత్తాన్ని నిర్ణీత గడువులోగా ప్రభుత్వానికి చెల్లించాలని ఆదేశించారు. నిర్ణీత ఏడు రోజుల్లో రూ.4.44 కోట్ల నష్ట పరిహారం చెల్లించని పక్షంలో రెవెన్యూ రికవరీ (ఆర్ఆర్) చట్టం ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ స్పష్టం చేశారు. సంబంధిత రైస్‌మిల్ యాజమాన్య కుటుంబ సభ్యులకు చెందిన స్థిర, చరాస్తులను జప్తు చేసి, వేలం ద్వారా ప్రభుత్వ బకాయిలను రికవరీ చేస్తామని నోటీసులో హెచ్చరించారు. ప్రభుత్వ ధాన్యం నిల్వల దుర్వినియోగంపై శాఖాపరమైన, చట్టపరమైన ప్రక్రియను నిబంధనల ప్రకారం కొనసాగిస్తామని తహసిల్దార్ తెలిపారు.

# ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ సీ. హెచ్ ప్రియాంక

**నారాయణపేట, సెప్టెంబర్,21(సమయం న్యూస్)** ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి వీలైనంత త్వరగా వాటిని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ లోని ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 8 ఫిర్యాదులు వచ్చాయి.



జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.ఈ సందర్భంగా కలెక్ట ర్ మాట్లాడుతూ.. ప్రజావాణి అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా సత్వరం పరిష్కరించాలన్నారు. శాఖల వారీగా ఆయా అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి వెంటనే పరిష్కరించాలి.అదనపు కలెక్టర్ శ్రీను,వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు...... జిల్లా పౌర సంబంధాల అధికారి నారాయణపేట చే జారీ చేయబడింది.

# చేనేత కార్మికుల సంక్షేమానికి బాపూజీ సేవలు చిరస్మరణీయం

- చేనేత రంగానికి సహకార స్ఫూర్తి ప్రదాత ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ...చిప్ప వెంకటేశ్వర్లు నేత

**కొత్తవాడ/వరంగల్, సెప్టెంబర్ 21 (సమయం న్యూస్) :** చేనేత కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం జీవితాంతం పోరాడిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయమని టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు నేత కొనియాడారు. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 14వ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం కొత్తవాడ గోపాలస్వామి గుడి జంక్షన్ వద్ద మట్టెవాడ చేనేత సహకార సంఘం అధ్యక్షుడు దువ్వల రాజేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ



సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నూలుదండలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం చిప్ప వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చేనేత కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు బాపూజీ చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుందన్నారు. చేనేత సంఘాల ఏర్పాటుకు మార్గదర్శకత్వం వహించడంతో పాటు సహకార చట్ట ం ద్వారా చేనేత కార్మికులకు సంఘటిత బలాన్ని కల్పించి, ఉపాధి అవకాశాల మెరుగుదలకు కృషి చేసిన మహానేతగా ఆయనను అభివర్ణించారు. చేనేత రంగం ఎదుర్కొంటున్న సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లడంలోనూ, కార్మికుల హక్కుల పరిరక్షణలోనూ కొండా లక్ష్మణ్ బాపూజీ పోషించిన పాత్ర ప్రత్యేకమైనదని పేర్కొన్నారు. చేనేత కుటుంబాల ఆర్థిక, సామాజిక అభ్యున్నతి కోసం ఆయన సాగించిన పోరాట స్ఫూర్తిని నేటి తరం కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. బాపూజీ ఆశయాల సాధనకు చేనేత కార్మికులు, సంఘాలు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చేనేత సంఘాల అధ్యక్షులు ఎలుగం సాంబయ్య, అడిగొప్పుల సంపత్, పంతగాని శ్రీనివాస్, దేవులపల్లి సత్యనారాయణ మూర్తి, కూరపాటి సంపత్, డీసీసీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు దాసరి రాజశేఖర్, పిట్ట రాములు, శ్రీరాం రాజేష్, బండి రాజమణి, కాంగ్రెస్ పార్టీ 23వ డివిజన్ అధ్యక్షుడు దామెర రాజ్ కమల్, బొల్లు సతీష్, తుమ్మ రాము, ఈగ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే.. సహకార సంఘాల సంకల్పం

- రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం: ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, పులి ప్రియాంక
- రైతు ప్రయోజనమే పరమావధిగా.. కొత్త పాలకవర్గం

**హసన్‌పర్తి, సెప్టెంబర్ 21 (సమయం న్యూస్):** రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగం అభివృద్ధిలో సహకార సంఘాలు కీలక పాత్ర పోషించాలని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, వరంగల్ గ్రేన్ మార్కెట్ ఛైర్మన్ పులి ప్రియాంక అన్నారు. రైతులకు అవసరమైన రుణాలు, ఎరువులు, ఇతర సేవలు సకాలంలో అందేలా సహకార సంఘాలు పనిచేస్తే క్షేత్రస్థాయిలో రైతులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. హసన్‌పర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (PACS) నూతన ఛైర్మన్, పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, పులి ప్రియాంక ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నూతన ఛైర్మన్ పింగిలి వెంకట్రామ్ నరసింహ రెడ్డితో పాటు పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన ఛైర్మన్, పాలకవర్గ సభ్యులను శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లా డుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ పనిచేస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు పలు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. రైతులకు ప్రభుత్వ పథకాలు, సహకార సేవలు సమర్థంగా అందించడంలో PACSలు కీలకంగా వ్యవహరించాల్సి ఉందన్నారు. హసన్‌పర్తి పరిధిలోని ప్రతి రైతుకు సకాలంలో రుణాలు, ఎరువులు అందేలా నూతన పాలకవర్గం చర్యలు తీసుకోవాలని



సూచించారు. రైతుల సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. రైతులకు నమ్మకమైన వేదికగా PACSను తీర్చి దిద్దాలని ఆకాంక్షించారు. పులి ప్రియాంక మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజకు మద్దతు ధర కల్పించడం, మార్కెట్లలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు సజావుగా నిర్వహించడం తమ ప్రధాన లక్ష్యమన్నారు. హసన్‌పర్తి PACS నూతన పాలకవర్గం గ్రేన్ మార్కెట్ కమిటీతో సమన్వయం చేసుకుంటూ రైతులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో విస్తృతంగా చేరవేయడంలో నూతన పాలకవర్గం చురుకైన పాత్ర పోషించాలని ఆమె కోరారు. రైతుల సమస్యలకు తక్షణ స్పందన, సేవల అందుబాటులో పార దర్శకతకు ప్రాధాన్యమివ్వాలని పేర్కొ న్నారు. కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన డైరెక్ట ర్లు సహకార శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, హసన్‌పర్తి మండల పరిధిలోని రైతులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 'ఎంజీఎం'లో రోగుల భద్రత గాలిలో దీపమేనా.?

- అనారోగ్యంలో పెద్దాసుపత్రి 'ఎంజీఎం'
- ఎంజీఎం భవనాల భద్రతపై సమగ్ర విచారణ జరపాలి
- ఆరోగ్యశ్రీ వార్డులో పైకప్పు పెచ్చులు ఊడి రోగులు గాయపడటం తీవ్ర ఆందోళనకరం
- బాధితులకు మెరుగైన వైద్యం, నష్టపరిహారం అందించాలి... గంట రవికుమార్
- ప్రాణాలను కాపాడే 'ఎంజీఎం' వెంటిలేటర్ పై ఉందా?

**వరంగల్, సెప్టెంబర్ 21 (సమయం న్యూస్):** ఉత్తర తెలంగాణకు ప్రధాన ప్రభుత్వ వైద్య కేంద్రంగా ఉన్న వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో భవనాల భద్రతపై ప్రభుత్వం తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ డిమాండ్ చేశారు. ఆరోగ్యశ్రీ వార్డులో పైకప్పు



పెచ్చులు ఊడి రోగులు, వారి సహాయకులు గాయపడిన ఘటన ఆసుపత్రిలో మౌలిక వసతుల పరిస్థితిపై ఆందోళన కలిగిస్తోందని అన్నారు.

ఘటనలో గాయపడిన బాధితులను పరామర్శించేందుకు సోమవారం ఎంజీఎం ఆసుపత్రికి గంట రవికుమార్‌తో పాటు బీజేపీ నాయకులు వెళ్లారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ప్రాంగణంలో కొంతసేపు పోలీసులతో బీజేపీ నాయకులకు వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం ప్రమాదం జరిగిన ఆరోగ్యశ్రీ వార్డును వారు పరిశీలించారు. వార్డులోని పరిస్థితులను, భవనం స్థితిగతులను పరిశీలించిన నాయకులు ఆసుపత్రి మౌలిక వసతులపై ఆందోళన వ్యక్తం చేశారు.

**ఆసుపత్రి భద్రతపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి...**

అనంతరం గంట రవికుమార్ మీడియాతో మాట్లాడుతూ నిరుపేదలకు ఉచిత వైద్యం అందించాల్సిన ఆరోగ్యశ్రీ వార్డులోనే పైకప్పు పెచ్చులు ఊడి రోగులు గాయపడటం తీవ్ర ఆందోళనకరమన్నారు. రోగులను రక్షించాల్సిన ఆసుపత్రిలోనే ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం ఆసుపత్రి భవనాల నిర్వహణ, భద్రతపై ప్రశ్నలు తలెత్తేలా చేస్తోందన్నారు. ఎంజీఎం ఆసుపత్రిలోని భవనాల పరిస్థితిని సమగ్రంగా పరిశీలించి, ఎక్కడైనా ప్రమాదకర పరిస్థితులు ఉంటే ముందుగానే గుర్తించి మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు సురక్షితమైన వాతావరణం కల్పించడం ప్రభుత్వ బాధ్యతని పేర్కొన్నారు.

**బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలి...**

పైకప్పు పెచ్చులు ఊడిపడిన ఘటనలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని, బాధితులకు తగిన నష్టపరిహారం అందించాలని గంట రవికుమార్ డిమాండ్ చేశారు. ఆసుపత్రి భవనాల భద్రతపై సమగ్ర సాంకేతిక పరిశీలన నిర్వహించి, లోపాలను తక్షణమే సరిదిద్దాలని కోరారు. ఆరోగ్యశాఖపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, భద్రత, వైద్య సేవలను మెరుగుపరచాలని సూచించారు. సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైతే బీజేపీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రత్నం సతీష్ షా, జిల్లా ప్రధాన కార్యదర్శులు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, జిల్లా కార్యదర్శులు గోకే వెంకటేష్, వెంకట్ రావు, వివిధ మోర్చాల జిల్లా అధ్యక్షులు టేకుమట్ల రేణుక, కూచన క్రాంతికుమార్, ఎర్రగోళ్ల భరత్ వీర్, జిల్లా నాయకులు అంకాల జనార్ధన్, బైరి శ్యాంసుందర్, నోముల రతన్, గోగికార్ అనిల్, చిలువేరు రాజేందర్, మాచర్ల దినదయాల్, గుర్రాల చంద్రమౌళి, గడ్డం మహేందర్, కర్నే రవీందర్, మందోటి మహేందర్, షేర్ల అనిల్, కోమాకుల నాగరాజు, మడిపల్లి నాగరాజు, మార్త ఉషారాణి, స్వర్ణజ, శైలశ్రీ, సుజాత, మండల అధ్యక్షులు మహమ్మద్ రఫీ, సీతా నాగరాజు, రజనీష్, తాళ్లపల్లి శ్రీనివాస్, జెట్లింగ్ శివ, బోడకుంట్ల శివ, ఆడేపు రవి తదితరులు పాల్గొన్నారు.

# సీఎస్‌కే కొత్త హెడ్ కోచ్‌గా జహీర్ ఖాన్

- ధోనీ సిఫారసుతో బాధ్యతలు
- స్టీఫెన్ ఫ్లెమింగ్ 18 ఏళ్ల శకానికి ముగింపు
- ఐపీఎల్ 2027 సీజన్ నుంచి కొత్త బాధ్యతలు చేపట్టనున్న భారత మాజీ పేసర్




**చెన్నై, సెప్టెంబర్ 21 (సమయం న్యూస్):** ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన ఫ్రాంచైజీల్లో ఒకటైన చెన్నై సూపర్ కింగ్స్ (CSK) తమ కోచింగ్ విభాగంలో చారిత్రాత్మక మార్పుకు శ్రీకారం చుట్టింది. భారత మాజీ స్పీడ్ స్టార్ జహీర్ ఖాన్‌ను జట్టు నూతన హెడ్ కోచ్‌గా నియమిస్తున్నట్లు సీఎస్‌కే యాజమాన్యం సోమవారం అధికారికంగా ప్రకటించింది. 'Left Arm »»Takingμμ Over! Welcoming Zaheer Khan as the Head Coach of Chennai Super Kings!" అంటూ సోషల్ మీడియా వేదికగా ఆయనకు ఘనంగా స్వాగతం పలికింది. 2009 నుంచి సుదీర్ఘంగా 18 సంవత్సరాల పాటు సీఎస్‌కే ప్రధాన కోచ్‌గా వ్యవహరించి, జట్టుకు ఐదు ఐపీఎల్ టైటిళ్లు సాధించిపెట్టిన స్టీఫెన్ ఫ్లెమింగ్ స్థానంలో జహీర్ ఖాన్ బాధ్యతలు స్వీకరించనున్నారు.

### ధోనీ నేతృత్వంలోనే ముగిసిన అన్వేషణ

స్టీఫెన్ ఫ్లెమింగ్ తప్పుకున్న తర్వాత స్థానిక (భారత) కోచ్‌కే ప్రాధాన్యమివ్వాలని నిర్ణయించిన యాజమాన్యం, కొత్త హెడ్ కోచ్‌ను ఎంపిక చేసే బాధ్యతను ఎంఎస్ ధోనీకే అప్పగించింది. అంతర్జాతీయ స్థాయిలో, ఐపీఎల్‌లో జహీర్ ఖాన్‌కున్న క్రికెటింగ్ మేధస్సుపై పూర్తి నమ్మకంతో ధోనీ ఆయన పేరును ప్రతిపాదించగా.. జట్టు ఓనర్ రూపా గురునాథ్, కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్, ఎండీ కాశీ విశ్వనాథన్‌లతో కూడిన కమిటీ దీనికి ఆమోదం తెలిపింది. గతంలో ముంబై ఇండియన్స్ డైరెక్టర్ ఆఫ్ క్రికెట్ ఆపరేషన్స్‌గా, లక్నో సూపర్ జెయింట్స్ మెంటార్‌గా వ్యవహరించిన అనుభవం జహీర్‌కు ఉంది.

### సీఎస్‌కేలో నూతన అధ్యాయం

సీఎస్‌కే హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టడంపై జహీర్ ఖాన్ ఆనందం వ్యక్తం చేశారు. "ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత విజయవంతమైన జట్టులో భాగమవ్వడం గౌరవంగా భావిస్తున్నాను. ఆటగాడిగా చెపాక్‌లో సీఎస్‌కేను ఎదుర్కొన్న అనుభవాలు అద్భుతమైనవి. అక్కడి 'సూపర్‌ఫ్యాన్స్' సృష్టించే వాతావరణం ప్రత్యేకం" అని జహీర్ పేర్కొన్నారు. 2010, 2011, 2018, 2021, 2023లలో ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన సీఎస్‌కే, గత మూడు సీజన్లలో అను అనుకున్న స్థాయిలో రాణించలేకపోయింది. ఈ నేపథ్యంలో 2027 ఐపీఎల్ సీజన్‌కు ముందే జట్టు నిర్మాణం, యువ బౌలర్లను తీర్చిదిద్దడం, వేలం వ్యూహాలు ఖరారు చేయడం జహీర్ ఖాన్ ముందున్న ప్రధాన లక్ష్యాలు.




# విదేశాల్లో ఆ ఇద్దరూ మెరుగుపడాలి

## సందీప్ పాటిల్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 21 (సమయం న్యూస్):** భారత క్రికెట్‌లో దూకుడైన బ్యాటింగ్‌తో ఆకట్టుకుంటున్న యువ ఆటగాళ్లు అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీలపై మాజీ భారత ఆల్‌రౌండర్ సందీప్ పాటిల్ ప్రశంసలు కురిపించారు. ఇద్దరిలోనూ అద్భుతమైన ప్రతిభ, భారీ షాట్లు ఆడే సామర్థ్యం ఉందని పేర్కొన్నారు. అయితే విదేశీ పరిస్థితుల్లో తమ ఆటను మరింత మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. స్వదేశంలో బంతిని ఎదుర్కొనే సమయంలో అభిషేక్, వైభవ్ ఎంతో దూకుడుగా కనిపిస్తున్నారని పాటిల్ అన్నారు. అయితే బంతి స్వింగ్ అవుతున్న పరిస్థితుల్లో ఇద్దరూ కొంత ఇబ్బంది పడుతున్నట్లు కనిపించిందని పేర్కొన్నారు. ముఖ్యంగా ఇంగ్లాండ్ పర్యటనలో ఈ విషయం స్పష్టమైందని చెప్పారు. విదేశీ పిచ్‌లపై పరిస్థితులకు అనుగుణంగా బ్యాటింగ్ శైలిని మార్చుకోవడం యువ ఆటగాళ్లకు ఎంతో ముఖ్యమని సూచించారు. జులైలో జరిగిన ఇంగ్లాండ్ టీ20 సిరీస్‌లో అభిషేక్ శర్మ ఐదు మ్యాచ్‌ల్లో 131 పరుగులు చేశాడు. అదే సిరీస్‌లో వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ టీ20ల్లో అరంగేట్రం చేసి మూడు మ్యాచ్‌ల్లో 42 పరుగులు సాధించాడు. స్వింగ్‌కు అనుకూలమైన పరిస్థితుల్లో వారి బ్యాటింగ్‌పై సందేహాలు వ్యక్తమైనప్పటికీ, ఆ తర్వాతి మ్యాచ్‌ల్లో ఇద్దరూ తమ సత్తాను చాటుకున్నారు. జింబాబ్వేతో జరిగిన టీ20 సిరీస్‌లో వైభవ్ సూర్యవంశీ ఆకట్టుకోగా, భారత్ సిరీస్‌ను 3-0తో కైవసం చేసుకున్న సమయంలో అతడు అత్యుత్తమ ఆటగాడిగా నిలిచాడు. మరోవైపు అఫ్గానిస్థాన్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో అభిషేక్ శర్మ తన బ్యాటింగ్ సత్తాను మరోసారి చాటాడు. చివరి మ్యాచ్‌లో కేవలం 30 బంతుల్లోనే శతకం సాధించి సంచలనం సృష్టించాడు. అభిషేక్ నుంచి ఇలాంటి ఇన్నింగ్స్ రావడం తనకు ఆశ్చర్యం కలిగించలేదని పాటిల్ అన్నారు. ఆధునిక క్రికెట్‌లో యువ బ్యాటర్లకు తొలి బంతి నుంచే సహజమైన దూకుడుతో ఆడే స్వేచ్ఛ లభిస్తోందని, అభిషేక్, వైభవ్ ఆ అవకాశాన్ని సమర్థంగా ఉపయోగించుకుంటున్నారని ప్రశంసించారు. అయితే విదేశీ పర్యటనల్లోనూ అదే స్థాయిలో రాణించాలంటే స్వింగ్ అవుతున్న బంతులను ఎదుర్కొనే విషయంలో మరింత పట్టు సాధించాల్సిన అవసరం ఉందని సూచించారు.

# షూటింగ్‌లో మరో రజత పతకం

**టేబుల్ టెన్నిస్‌లో పాకిస్థాన్‌ను 3-0తో చిత్తు చేసిన భారత్**

- ఏషియన్ గేమ్స్‌లో భారత్ జోరు
- షూటింగ్‌లో మరో సిల్వర్
- పాక్‌పై టేబుల్ టెన్నిస్‌లో ఘన విజయం



**ఐచి-నాగోయా, సెప్టెంబర్ 21 (సమయం న్యూస్):** జపాన్‌లోని ఐచి-నాగోయాలో జరుగుతున్న ఏషియన్ గేమ్స్ 2026లో భారత్‌కు రెండో రోజు కూడా పతకాల పంట కొనసాగుతోంది. సెప్టెంబర్ 21న షూటింగ్‌లో పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ ఈవెంట్‌లో భారత్ రజత పతకం సాధించింది. దీంతో భారత్ ఖాతాలో ఇప్పటివరకు మూడు రజత పతకాలు చేరాయి. షూటింగ్‌లో హిమాంశు ధిల్లాన్, పార్త్ మానే, రుద్రాంశ్ పాటిల్తో కూడిన భారత జట్టు 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ ఈవెంట్‌లో రెండో స్థానంలో నిలిచింది. ఈ విజయంతో భారత్ మరో రజత పతకాన్ని ఖాతాలో వేసుకుంది. మహిళల టేబుల్ టెన్నిస్‌లో భారత్, పాకిస్థాన్ మధ్య జరిగిన గ్రూప్ ఎఫ్ మ్యాచ్‌లో భారత జట్టు 3-0తో విజయం సాధించింది. ఈ విజయంతో భారత మహిళల జట్టు క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించింది. భారత్ తరఫున సుతీర్థా ముఖర్జీ, సింద్రెలా దాస్, శ్రీజా అకులా తమ తమ మ్యాచ్‌ల్లో విజయాలు సాధించారు. శ్రీజా అకులా తన సింగిల్స్ మ్యాచ్‌లో ఫాతిమా ఖాన్‌ను 11-4, 11-4, 11-5 తేడాతో ఓడించి భారత్‌కు 3-0 విజయాన్ని ఖరారు చేశారు.

### భారత్‌కు పతకాలపై భారీ ఆశలు

ఏషియన్ గేమ్స్ రెండో రోజు భారత్ పలు క్రీడాంశాల్లో బరిలోకి దిగింది. షూటింగ్‌తో పాటు టేబుల్ టెన్నిస్, మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ (వీహీూ), హాకీ, కబడ్డీ, బ్యాడ్మింటన్, బాక్సింగ్ తదితర ఈవెంట్లలో భారత క్రీడాకారులు పోటీ పడుతున్నారు. వీహీూలో సుచికా తారియాల్ సెమీఫైనల్‌లో సింగపూర్‌కు చెందిన టియో హుయ్ హూన్‌తో తలపడాల్సి ఉంది. సెమీఫైనల్‌కు చేరుకోవడంతో సుచికా ఇప్పటికే కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేసుకున్నారు. ఫైనల్‌కు చేరితే స్వర్ణ పతకం కోసం పోటీపడే అవకాశం ఉంటుంది. మహిళల హాకీలో భారత్ ఇండోనేషియాతో, పురుషుల కబడ్డీలో జపాన్‌తో, మహిళల కబడ్డీలో బంగ్లాదేశ్‌తో తలపడుతోంది. బ్యాడ్మింటన్‌లో భారత పురుషుల జట్టు బంగ్లాదేశ్‌తో పోటీ పడుతోంది. బాక్సింగ్‌లో సుమిత్ 70 కేజీ విభాగంలో బుంజోంగ్ సింసిరితో పోటీపడుతున్నారు. ఏషియన్ గేమ్స్ 2026 తొలి రోజు భారత్‌కు షూటింగ్‌లో రెండు రజత పతకాలు లభించాయి. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత విభాగంలో ఎలావెనిల్ వలరివన్ రజతం సాధించగా, టీమ్ ఈవెంట్‌లో ఎలావెనిల్ వలరివన్, సోనమ్ మాస్కర్, విదర్భా వినోద్‌లతో కూడిన భారత జట్టు మరో రజత పతకం సాధించింది. ఇప్పుడు పురుషుల షూటింగ్ టీమ్ సాధించిన మరో రజతంతో భారత్ పతకాల సంఖ్య మూడు రజతాలకు చేరింది. ఏషియన్ గేమ్స్‌లో భారత్ మరిన్ని పతకాలు సాధించేందుకు రెండో రోజు పోటీలు కొనసాగుతున్నాయి.

# ఏషియన్ గేమ్స్‌లో సుచికా చరిత్ర

**హైదరాబాద్, సెప్టెంబరు 21 (సమయం న్యూస్):** ఏషియన్ గేమ్స్‌లో మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ విభాగంలో భారత క్రీడాకారిణి సుచికా తారియాల్ చరిత్ర సృష్టించింది. మహిళల ట్రెడిషనల్ 60 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించింది. ఏషియన్ గేమ్స్‌లో ఎంఎంఏకు తొలిసారి చోటు దక్కగా.. ఈ విభాగంలో భారత్‌కు తొలి పతకాన్ని అందించిన క్రీడాకారిణిగా సుచికా రికార్డు నెలకొల్పింది. సెమీఫైనల్లో సింగపూర్‌కు చెందిన హుయ్ హూన్ టియోతో సుచికా తలపడింది. హోరాహోరీగా సాగిన ఈ పోరు అదనపు సమయానికి వెళ్లింది. చివరికి స్వల్ప తేడాతో సుచికా ఓటమి పాలై ఫైనల్ అవకాశాన్ని కోల్పోయింది. అయితే అప్పటికే కాంస్య పతకం ఖరారైంది. అంతకుముందు క్వార్టర్‌ఫైనల్లో మంగోలియాకు చెందిన అల్టాన్‌చిమెగ్ బైగల్మాను 2-0తో ఓడించి భారత్‌కు ఎంఎంఏలో తొలి పతకాన్ని ఖాయం చేసింది. 36 ఏళ్ల సుచికా క్రీడా ప్రయాణం ఎంఎంఏకే పరిమితం కాలేదు. జాతీయస్థాయిలో జూడో క్రీడాకారిణిగా ఎదిగిన ఆమె 2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్‌లో పాల్గొంది. 2023 ఏషియన్ గేమ్స్‌లో కురాష్‌లోనూ పోటీపడింది. అనంతరం జియూ-జిట్సులో రాణించి 2024లో ఫైటింగ్ జియూ-జిట్సు ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచింది. 2017లో ఎంఎంఏలో ప్రొఫెషనల్‌గా అరంగేట్రం చేసిన ఆమె.. ఇతర క్రీడలపై దృష్టి పెట్టడంతో కొంతకాలం ఎంఎంఏకు దూరంగా ఉంది. 2024లో మళ్లీ ఎంఎంఏలోకి అడుగుపెట్టి 'బ్రేవ్ కంబాట్ ఫెడరేషన్'తో ఒప్పందం చేసుకుంది. గాయాలు సహా పలు సవాళ్లను అధిగమించి తిరిగి పోటీల్లోకి వచ్చిన సుచికా.. ఇప్పుడు ఏషియన్ గేమ్స్‌లో భారత్‌కు చారిత్రక పతకాన్ని అందించింది. ఏషియన్ గేమ్స్‌లో ఎంఎంఏ తొలిసారి ప్రవేశించగానే భారత్‌కు పతకం రావడం విశేషంగా



# ఫాల్కన్స్ 'ఫస్ట్' ఫైట్.. సీపీఎల్ కిరీటం సొంతం!




- జమైకా కింగ్స్‌మెన్‌కు ఫైనల్లో షాక్
- 8 వికెట్ల తేడాతో ఫాల్కన్స్ ఘన విజయం
- సదాఖత్ 114 పరుగుల విధ్వంసం వృథా
- 4 వికెట్లతో మ్యాచ్‌ను తిప్పిన మొకీమ్
- మూడో సీజన్‌లోనే తొలి టైటిల్ ముద్దాడిన ఆంటిగ్వా

**బ్రిడ్జ్‌టౌన్, సెప్టెంబర్ 21 (సమయం న్యూస్):** కరీబియన్ ప్రీమియర్ లీగ్‌లో ఆంటిగ్వా అండ్ బార్బుడా ఫాల్కన్స్ కొత్త చరిత్ర సృష్టించింది. కెన్సింగ్టన్ ఓవల్‌లో ఆదివారం రాత్రి జరిగిన 2026 ఫైనల్లో జమైకా కింగ్స్‌మెన్‌ను ఎనిమిది వికెట్ల తేడాతో చిత్తుచేసి తొలిసారి సీపీఎల్ కిరీటాన్ని ముద్దాడింది. 171 పరుగుల లక్ష్యాన్ని ఫాల్కన్స్ 16.4 ఓవర్లలోనే రెండు వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఫ్రాంచైజీగా మూడో సీజన్‌లోనే ఛాంపియన్‌గా నిలిచి సత్తా చాటింది.

### సదాఖత్ ఒంటరి పోరాటం

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన జమైకా కింగ్స్‌మెన్ నిర్ణీత 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లకు 170 పరుగులు చేసింది. మాజ్ సదాఖత్ 58 బంతుల్లో ఎనిమిది ఫోర్లు, తొమ్మిది సిక్సర్లతో ఏకంగా 114 పరుగులు బాదాడు. సైమ్ అయూబ్ 29 పరుగులు చేయగా మిగతా బ్యాటర్లు పెద్దగా రాణించలేకపోయారు. కిర్క్ మెకెంజీ, రోవ్‌మన్ పావెల్ సహా పలువురు ఖాతా తెరవకుండానే వెనుదిరిగారు. 30 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయిన కింగ్స్‌మెన్‌ను సదాఖత్, అయూబ్ ఆదుకున్నారు. మూడో వికెట్‌కు 80 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి స్కోరును 110 పరుగులకు చేర్చారు. ఈ దశలో ఫాల్కన్స్ స్పిన్నర్ సుఫ్యాన్ మొకీమ్ మ్యాచ్‌ను మలుపుతిప్పాడు. అయూబ్, పావెల్‌ను ఒకే ఓవర్‌లో పెవిలియన్‌కు పంపడంతో కింగ్స్‌మెన్ ఒక్కసారిగా కుప్పకూలింది. మొకీమ్ నాలుగు వికెట్లకు కేవలం 14 పరుగులిచ్చి ఫాల్కన్స్‌కు భారీ ఆధిక్యం అందించాడు.

### 171 లక్ష్యం.. 100 బంతుల్లోనే ఫినిష్

లక్ష్య ఛేదనలో రహ్‌కీమ్ కార్న్‌వాల్ తొలి ఓవర్‌లోనే రెండు ఫోర్లు, రెండు సిక్సర్లతో 20 పరుగులు రాబట్టి మెరుపు ఆరంభం ఇచ్చాడు. అయితే అదే ఓవర్ చివరి బంతికి ఔటయ్యాడు. అనంతరం ఎవిన్ లూయిస్, అమీర్ జంగూ రెండో వికెట్‌కు 64 పరుగులు జోడించారు. లూయిస్ 38 పరుగుల వద్ద వెనుదిరిగినా ఫాల్కన్స్ జోరుకు అడ్డుకట్ట పడలేదు. అమీర్ జంగూ, హసన్ నవాజ్ ఆ తర్వాత కింగ్స్‌మెన్ బౌలర్లకు మరో అవకాశం ఇవ్వలేదు. ఇద్దరూ మూడో వికెట్‌కు అజేయంగా 89 పరుగులు జోడించారు. జంగూ 57, హసన్ నవాజ్ 47 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. 16.4 ఓవర్లలో 173/2తో ఫాల్కన్స్ లక్ష్యాన్ని చేరుకుని మరో 20 బంతులు మిగిలుండగానే చారిత్రక విజయాన్ని అందుకుంది. నాలుగు వికెట్లతో ఫైనల్‌ను మలుపుతిప్పిన సుఫ్యాన్ మొకీమ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా, టోర్నీ మొత్తంలో రాణించిన షాదాబ్ ఖాన్ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా నిలిచారు. సదాఖత్ శతకం.. కింగ్స్‌మెన్ పోరాటం.. అన్నింటినీ అధిగమించిన ఫాల్కన్స్ చివరకు సీపీఎల్‌లో తమ తొలి కిరీటాన్ని ఎగరేసుకుపోయింది.



# విడాకుల ప్రచారంపై నీతి టేలర్ స్పందన

హైదరాబాద్ సెప్టెంబరు 21 (సమయం న్యూస్):తెలుగులో 'మేం వయసుకు వచ్చాం', 'పెళ్లి పుస్తకం' వంటి చిత్రాల్లో నటించి, అనంతరం హిందీ బుల్లితెరపై నటిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న నటి నీతి టేలర్ తన వైవాహిక జీవితంపై వస్తున్న పుకార్లకు చెక్ పెట్టారు. 2020లో ఇండియన్ ఆర్మీ అధికారి పరిక్షిత్ బవాతో వివాహ బంధంలోకి అడుగుపెట్టిన ఆమె, గత కొంతకాలంగా భర్తతో విడాకులు తీసుకోబోతున్నారంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. తన విడాకుల వార్తలపై స్పందిస్తూ, సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలు తమను పెద్దగా ప్రభావితం చేయవని నీతి టేలర్ స్పష్టం చేశారు. తమ బంధం గురించి తమకు పూర్తిగా తెలుసని, ప్రస్తుతం తామిద్దరం ఎంతో క్షేమంగా, సంతోషంగా వైవాహిక జీవితాన్ని కొనసాగిస్తున్నామని వెల్లడించారు. తమ దాంపత్య జీవితంపై ఇకనైనా దుష్ప్రచారాలు చేయడం నిలిపివేయాలని కోరారు. గతంలో పాల్గొన్న ఒక ఓటీటీ రియాలిటీ షోలో తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన చేదు అనుభవాలను నీతి పంచుకున్నారు. కెరీర్ ప్రారంభంలో ఒక మాజీ ప్రియుడు తనపై భౌతిక దాడికి దిగడంతో పాటు తీవ్రంగా హింసించాడని, ఆ భయానక బంధం నుంచి బయటపడి మానసికంగా కోలుకోవడానికి సమయం పట్టిందని తెలిపింది. ఆ చేదు జ్ఞాపకాల నుంచి బయటపడ్డాక పరిక్షిత్ తన జీవితంలోకి రావడం ఎంతో ప్రత్యేకమని, ప్రస్తుతం తన భర్తతో ఎంతో ఆనందంగా ఉన్నానని తెలపడంతో విడాకుల వార్తలకు ముగింపు పడింది.

# బోల్డ్ సీన్లపై రాధికా ఆప్టే కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్ సెప్టెంబరు 21 (సమయం న్యూస్):** తెలుగులో 'లెజెండ్', 'లయన్' వంటి చిత్రాల్లో నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్న ప్రముఖ నటి రాధికా ఆప్టే, సినీ పరిశ్రమలో తన కెరీర్ ప్రారంభంలో ఎదుర్కొన్న కొన్ని చేదు అనుభవాలపై స్పందించారు. ఒకసారి బోల్డ్ సన్నివేశంలో నటిస్తే, ఇకపై ఎలాంటి సన్నివేశానికైనా సరే సమ్మతి తెలియజేస్తారనే అభిప్రాయం కొందరిలో ఏర్పడటం తనను తీవ్ర అసంతృప్తికి గురిచేసిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. నటిగా ప్రయాణంలో తన ఆలోచనా విధానం మారిందని, కథకు లేదా పాత్రకు అవసరం లేని సన్నివేశాలు చేయడానికి తాను ఇప్పుడు అంగీకరించనని స్పష్టం చేశారు. బోల్డ్ సన్నివేశాల విషయంలో కొందరు మేకర్స్ వ్యవహరించే తీరును ఆమె ఆక్షేపించారు. ఒక సీన్ కథకు ఎందుకు అవసరమో స్పష్టంగా వివరించకుండా, "ఇది కేవలం 15 సెకన్ల సన్నివేశమే కదా, చేసేయండి" అంటూ మాట్లాడటం ఆశ్చర్యం కలిగిస్తుందని పేర్కొన్నారు. ఒక నటికి సంబంధించిన సన్నివేశాన్ని కేవలం సెకన్ల వ్యవధితో కొలవడం సరైన విధానం కాదని ఆమె అభిప్రాయపడ్డారు. తన కెరీర్‌లో ఎదురైన మరో చేదు సంఘటనను గుర్తుచేసుకుంటూ, ఓ భారీ చిత్రంలో యాక్షన్ సన్నివేశం చిత్రీకరిస్తున్నప్పుడు షర్ట్ బటన్లు పూర్తిగా విప్పి నటించాలని తనపై ఒత్తిడి తెచ్చారని తెలిపారు. యాక్షన్ సన్నివేశానికి అలాంటి దుస్తులు ఎందుకు అవసరమని ప్రశ్నిస్తూ ఆ ప్రతిపాదనను తిరస్కరించినట్లు వెల్లడించారు. తనను ఆ విధంగా నటించమని కోరిన వ్యక్తి సినీ పరిశ్రమలో ఉన్నత స్థాయిలో ఉన్న ప్రముఖ వ్యక్తి అని, ఆయన పేరు బయటపెడితే చాలామంది ఆశ్చర్యపోతారని పేర్కొన్నారు. అయితే వ్యక్తిగతంగా ఎవరినీ లక్ష్యంగా చేసుకోవడం తన ఉద్దేశం కాదని రాధికా ఆప్టే స్పష్టం చేశారు.

# 'ది ప్యారడైజ్' ప్రీ రిలీజ్ వేడుకపై ఆసక్తి


హైదరాబాద్, సెప్టెంబరు 21 (ఉద్యమ కెటరం): నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కలయికలో తెరకెక్కిన ప్రతిష్టాత్మక చిత్రం 'ది ప్యారడైజ్'. పలుమార్లు వాయిదా పడిన ఈ సినిమా ఎట్టకేలకు సెప్టెంబరు 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. తెలుగు రాష్ట్రాల్లో సెప్టెంబరు 23 నుంచే ప్రత్యేక ప్రదర్శనలు ప్రారంభం కానున్నట్లు సమాచారం. ఇప్పటికే చిత్రానికి సంబంధించిన సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. 'ఏ' ధ్రువపత్రం పొందిన ఈ సినిమా సుమారు 2 గంటల 49 నిమిషాల నిడివితో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే విడుదలైన 'ఆయా షేర్', 'ఏషనాగుల' పాటలకు మంచి స్పందన రావడంతో సినిమాపై అంచనాలు పెరిగాయి. సెప్టెంబరు 21న హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ వేడుకను ఘనంగా నిర్వహించేందుకు చిత్రబృందం ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమానికి మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరయ్యే అవకాశం ఉందనే వార్తలు టాలీవుడ్‌లో ఆసక్తిని పెంచుతున్నాయి. అయితే దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రీ రిలీజ్ వేడుక అనంతరం నాని తన అభిమానులతో ప్రత్యేకంగా సమావేశం కానున్నట్లు సమాచారం. దేశవ్యాప్తంగా సుమారు పదివేల మంది అభిమానులు ఈ కార్యక్రమానికి హాజరయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. అభిమానుల కోసం ప్రత్యేకంగా భోజన ఏర్పాట్లు కూడా చేయనున్నట్లు సమాచారం. మరోవైపు 'ది ప్యారడైజ్'కు ట్రైలర్ విడుదల చేయకుండా నేరుగా థియేటర్లలోకి తీసుకురావాలని చిత్రబృందం నిర్ణయించినట్లు తెలుస్తోంది. కథ, కంటెంట్‌పై ఉన్న నమ్మకంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. సినిమాలో నాని సరసన కయాదు లోహర్ కథానాయికగా నటించింది. మోహన్‌బాబు 'మాలిక్' అనే కీలక పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన 'ఏషనాగుల' పాటలో కీర్తి సురేశ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.





# ఫోన్లు పక్కనపెట్టి మాట్లాడుకోండి: కాజల్

**హైదరాబాద్ సెప్టెంబరు 21 (సమయం న్యూస్):** నేటి డిజిటల్ యుగంలో స్మార్ట్‌ఫోన్లు, సోషల్ మీడియా ప్రభావం మనుషుల మధ్య బంధాలపై తీవ్ర ప్రభావం చూపుతోందని ప్రముఖ నటి కాజల్ అగర్వాల్ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా భార్యాభర్తలు ఒకేచోట ఉన్నప్పటికీ ఒకరితో ఒకరు మాట్లాడుకోవడానికి తగినంత సమయం కేటాయించకపోవడం ఆందోళన కలిగించే విషయమని ఆమె పేర్కొన్నారు. భాగస్వామితో కలిసి బయటకు వెళ్లిన సమయంలో కూడా ఫోన్లలో మునిగిపోవడం వల్ల బంధాలలో కమ్యూనికేషన్ లోపించి దూరాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తన వ్యక్తిగత జీవితం గురించి చెబుతూ, తన భర్త గౌతమ్ కిచ్లూతో కలిసి వారానికి కనీసం ఒకరోజు డిన్నర్‌కు వెళ్తామని కాజల్ వెల్లడించారు. ఆ సమయంలో ఫోన్లను పూర్తిగా పక్కన పెట్టి కేవలం ఒకరితో ఒకరు సమయం గడపడానికి, ఆలోచనలను పంచుకోవడానికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. వివాహ బంధంలో భాగస్వామి మాటలను వినడం, భావాలను పంచుకోవడం అత్యంత కీలకమని, డిజిటల్ ప్రపంచంలో నిరంతరం గడపడం కంటే చుట్టూ ఉన్న వ్యక్తులతో నేరుగా మాట్లాడటమే ముఖ్యమని ఆమె హితవు పలికారు. కాగా, కాజల్ అగర్వాల్ న్యాయవాది పాత్రలో నటించిన 'ది ఇండియా స్టోరీ' చిత్రం ఇటీవలే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో (ఓటీటీ) విడుదలైంది. ఆహార కల్తీ, వ్యవసాయంలో పురుగుమందుల వాడకం వంటి సామాజిక అంశాల నేపథ్యంలో ఈ చిత్రం రూపుదిద్దుకుంది.



Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 7036644111, 9490140565

# పాలకులు మారినా.. ప్రజల జీవితాల్లో మార్పేదీ.?

- త్యాగాల తెలంగాణలో ప్రజా జీవితాల్లో మార్పు రావాలి
- కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధనే నిజమైన నివాళి... ఈగ మల్లేశం



**హనుమకొండ, సెప్టెంబర్ 21 (సమయం న్యూస్) :** దశాబ్దాల పోరాటం, ఎందరో అమరవీరుల త్యాగాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగాలని అఖిల భారత పద్మశాలి సంఘం పూర్వ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర ఖాదీ, చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం అన్నారు. పాలకులు మారడం మాత్రమే కాకుండా సామాన్య ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహ కూడలి వద్ద సోమవారం నిర్వహించిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 14వ వర్ధంతి కార్యక్రమానికి ఈగ మల్లేశం హాజరై ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశాలి సమాజంతో పాటు బడుగు, బలహీన వర్గాలు, చేనేత కార్మికుల అభ్యున్నతి కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. తెలంగాణ కోసం తన మంత్రి పదవిని త్యజించిన బాపూజీ త్యాగం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమం, చేనేత రంగం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషిని స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బాపూజీ ఆశయాల్లో సామాజిక న్యాయం, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి, చేనేత కార్మికుల సంక్షేమం ముఖ్యమైనవని ఈగ మల్లేశం పేర్కొన్నారు. ఆయన ఆశయాలను మాటల్లో స్మరించుకోవడం కంటే ఆచరణలోకి తీసుకురావడమే నిజమైన నివాళి అవుతుందన్నారు. సమాజంలోని వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**ఉద్యమ ఆకాంక్షలు.. నేటి వాస్తవాలకు మధ్య వ్యత్యాసం...**

తెలంగాణ కోసం సాగిన సుదీర్ఘ ఉద్యమంలో ప్రజలు ఎన్నో ఆశలు, ఆకాంక్షలు పెట్టుకున్నారని, రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆ ఆకాంక్షలు ఎంతవరకు నెరవేరుతున్నాయనే దానిపై ప్రజల్లో చర్చ జరగాల్సిన అవసరం ఉందని ఈగ మల్లేశం అన్నారు. పాలకులు మారడం మాత్రమే కాకుండా పాలనలో పారదర్శకత, ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ప్రజల సమస్యలు, నిరుద్యోగ యువత ఆకాంక్షలు, రైతుల సంక్షేమం, చేనేత కార్మికుల జీవన పరిస్థితులపై పాలకులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. తెలంగాణ కోసం త్యాగాలు చేసిన అమర వీరుల ఆశయాలకు అనుగుణంగా ప్రజాకేంద్రిత పాలన కొనసాగాల్సిన అవసరం ఉందన్నారు.

**ప్రజా తెలంగాణ కోసం చైతన్యం అవసరం...**

తెలంగాణ ఆత్మగౌరవాన్ని, అమర వీరుల ఆశయాలను కాపాడుకునేందుకు ప్రజల్లో మరింత చైతన్యం అవసరమని ఈగ మల్లేశం అన్నారు. స్వార్థ రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర భవిష్యత్తు, యువత ఉపాధి అవకాశాలు, రైతుల సంక్షేమం, చేనేత కార్మికుల అభివృద్ధి వంటి అంశాలపై ప్రజా చర్చ జరగాలని పిలుపునిచ్చారు. ప్రజల హక్కులు, రాష్ట్ర ప్రయోజనాలు, సామాజిక న్యాయం కోసం ప్రజాస్వామ్య పద్ధతుల్లో నిరంతరం పోరాడాలని సూచించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేయడమే ఆయనకు అందించే ఘనమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో బచ్చు ఆనందం, వడన్నాల నరేందర్, వేముల నాగరాజు, గడ్డం కేశవమూర్తి, పులికంటి రాజేందర్, తవుటం ఝాన్సీరాణి రవీందర్, వేణుగోపాల్, బొప్ప శివశంకర్, వైద్యం రాజగోపాల్, గుర్రపు కోటేశ్వర్, కేదాశి వెంకటేశ్వర్లు , బత్తుల రమేష్, పాము శ్రీనివాస్, బింగి సతీష్, సత్యనారాయణ, సంతోష్, కాముని మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# గణనాథుని సన్నిధిలో ఎమ్మెల్యే 'నాయిని'..

- వివిధ మండపాల్లో ప్రత్యేక పూజలు.. భక్తులతో కలిసి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**హన్మకొండ, సెప్టెంబర్ 21 (సమయం న్యూస్):** గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో భక్తిశ్రద్ధలు వెల్లి విరిశాయి. గణనాథుని దర్శనానికి తరలి వచ్చిన భక్తులతో పలు గణేష్ మండపాలు సందడిగా మారాయి. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సోమవారం నియోజకవర్గంలోని పలు డివిజన్లలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 54వ, 53వ, 58వ, 51వ, 5వ డివిజన్లలో ప్రతిష్ఠించిన గణనాథులను ఎమ్మెల్యే దర్శించుకున్నారు. వేద మంత్రోచ్చారణల మధ్య స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలతో కలిసి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఆయా మండపాల వద్దకు ఎమ్మెల్యే చేరుకోగానే ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, యువత, భక్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఉత్సవ నిర్వాహకులతో ఎమ్మెల్యే మాట్లా డి మండపాల వద్ద భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఉత్సవాలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో కొనసాగేందుకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. నాయిని రాజేందర్ రెడ్డి మాట్లా డుతూ గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు ప్రజల్లో ఐక్యతను, సామాజిక సౌభ్రాతృత్వాన్ని బలోపేతం చేస్తాయని అన్నారు. యువత ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొనడం సంతోషకరమని పేర్కొన్నారు. గణనాథుని ఆశీస్సులతో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మండపాల వద్ద సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు.ఎమ్మెల్యే పర్యటన సందర్భంగా ఆయా గణేష్ ఉత్సవ కమిటీల సభ్యులు ఆయనను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమాల్లో స్థానిక కాంగ్రెస్ నాయకులు, డివిజన్ నాయకులు, కార్యకర్తలు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, యువత, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమం గడప దాటాలి.. సేవా స్ఫూర్తి పల్లెకు చేరాలి

- ప్రజా సమస్యలే ఎజెండా.. సేవలో ముందుండాలి..
- పల్లె బాటలో కాంగ్రెస్.. ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయం
- పార్టీ కార్యాలయం ప్రారంభం.. నూతన కమిటీల పరిచయ వేదికలో కదంతొక్కిన శ్రేణులు
- ప్రభుత్వ సంక్షేమ ఫలాలను ప్రతి అర్హుడికీ చేర్చడమే నూతన కమిటీల బాధ్యత
- ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, డిసిసి అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి



**ధర్మసాగర్, సెప్టెంబర్ 21 (సమయం న్యూస్):** ధర్మసాగర్ మండలంలో కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీల ఏర్పాటుతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని సోమవారం స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ కడియం కావ్య, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమి టీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం నూతన మండల, గ్రామ కమిటీల పరిచయ వేదికను నిర్వహించారు. పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవం అనంతరం నూతనంగా ఎన్నికైన మండల, గ్రామ కమిటీల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ సుస్మిత ఫంక్షన్ హాల్‌కు చేరుకోవడంతో అక్కడ నూతన కార్యవర్గ పరిచయ వేదిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మసాగర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పెసరు రమేష్ ఆధ్వర్యంలో నూతన కమిటీ సభ్యులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డికి ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు.

**ప్రజలకు అందుబాటులో ఉండే వారికే గుర్తింపు...**

సమావేశంలో ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ.. ధర్మసాగర్ మండలంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మండల, గ్రామ కమిటీల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరవేయడంలో పార్టీ కమిటీలు క్రియాశీలక పాత్ర పోషించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు, ఆరు గ్యారంటీల ద్వారా అర్హులకు అందుతున్న ప్రయోజనాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని అన్నారు. గ్రామస్థాయిలో ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. ధర్మసాగర్ మండలంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు గ్రామస్థాయి నుంచి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో విభేదాలకు, గ్రూపు రాజకీయాలకు తావులేకుండా స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి మార్గదర్శకత్వంలో ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, ప్రజలకు అండగా నిలవాలని కోరారు. నూతన కార్యవర్గ పరిచయ వేదికలో హసన్‌పర్తి పీఏసీఎస్ ఛైర్మన్ పింగిలి వెంకట్రామ్ నరసింహ రెడ్డి, మండల, గ్రామ కమిటీల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, జిల్లా కమిటీ సభ్యులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అకాల వర్షా లతో నష్ట పోయిన రైతులకు నష్ట పరిహార చెక్కులు

**తాండూరు మండలం, సెప్టెంబర్,21(సమయం న్యూస్** గత ఏడాది కురిసిన అకాల వర్షాలతో నష్ట పోయిన బాధిత రైతులకు ఎట్టకేలకు ఊరట లభించింది. సోమవారం వికారాబాద్ జిల్లా తాండూర్ మండలం సంగెంకలాన్ గ్రామంలో రైల్వే ట్రాక్ పరిసర ప్రాంతాల్లో పంటలు దెబ్బతిన్న 57 మంది రైతులకు చెట్టినాడ్ సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో మంజూరైన సుమారు రూ.14 లక్షల విలువైన పంట నష్టపరిహారం చెక్కులను రైతులకు చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ... సామాజిక బాధ్యతగా ముందుకొచ్చి రైతులకు ఆర్థిక సహాయం అందించిన చెట్టినాడ్ సిమెంట్ కంపెనీ యాజమాన్యాన్ని ఈ సందర్భంగా అభినందిస్తున్నామన్నారు. వర్షాల వల్ల నష్టపోయిన ప్రతి రైతుకూ న్యాయం జరిగేలా కృషి చేయడం జరిగిందన్నారు.ప్రభుత్వపరంగా, స్థానిక పరిశ్రమల సహకారంతో తాండూరు నియోజకవర్గ అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తామన్నారు.

# అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS



**నారాయణపేట, సెప్టెంబర్,21(సమయం న్యూస్)** నారాయణపేట జిల్లా కేంద్రంలోని చౌక్ బజార్ సమీపంలో శ్రీ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయక మండపం వద్ద సోమవారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ డాక్టర్ జి. వినీత్ IPS ముఖ్యఅతిథిగా హాజరై గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. వినాయక మండపం నిర్వాహకులు జిల్లా ఎస్పీని ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS మాట్లాడుతూ.. వినాయక చవితి ఉత్సవాలను ప్రతి ఒక్కరూ శాంతియుత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో,సోదరభావంతో నిర్వహించుకోవాలని సూచించారు. ఉత్సవాల సందర్భంగా ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా పెద్ద శబ్దంతో సౌండ్ సిస్టమ్స్, డీజేలు ఏర్పాటు చేయవద్దని స్పష్టం చేశారు.నారాయణపేట జిల్లా అంటేనే శాంతిభద్రతల పరిరక్షణలో నెంబర్ వన్ అనే విధంగా ప్రజలు, ఉత్సవ నిర్వాహకులు, యువత పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా పోలీసు శాఖ సూచించిన నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటిస్తూ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో గణేష్ మండపం నిర్వాహకులు, స్థానిక ప్రజలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సెంటిమెంట్‌ను అడ్డుపెట్టు కుని సంపద దోచుకున్నారు

- బీఆర్ఎస్ నేతల భూ వ్యవహారాలపై క్షేత్రస్థాయి పరిశీలన
- ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



**ఆలేరు, సెప్టెంబర్ 21(సమయం న్యూస్):** తెలంగాణ సెంటిమెంట్‌ను అడ్డుపెట్టుకుని అధికారాన్ని అనుభవిస్తూ రాష్ట్రంలోని సంపదను దోచుకున్నారని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఆరోపించారు. బీఆర్ఎస్ నేతల భూ వ్యవహారాలు, ఫామ్‌హౌస్‌ల నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు.

షాబాద్ మండలం మద్దూరు గ్రామంలోని బీఆర్ఎస్ మాజీ మంత్రి, ప్రస్తుత సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి ఫామ్‌హౌస్‌ను ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు పరిశీలించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీర్ల అయిలయ్య మాట్లా డారు.

ఆస్తులు ఎలా పెరిగాయో చెప్పాలి. పేదలకు చెందిన ఇనామ్, సీలింగ్ భూములు ఏ విధంగా ఆక్రమణలకు గురయ్యాయనే అంశాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో వివరించారని బీర్ల అయిలయ్య తెలిపారు. ప్రజాప్రతినిధులుగా ఉన్న ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఆస్తులు, భూ వ్యవహారాలపై వరుసగా నాలుగో రోజు క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నామని చెప్పారు. పరిశీలనలో గుర్తించిన అంశాలను ప్రజల ముందుంచుతామని పేర్కొన్నారు. జగదీశ్‌రెడ్డి 2009 ఎన్నికల సమయంలో సమర్పించిన ఎన్నికల అఫిడవిట్‌లో రూ.12 లక్షల ఆస్తులు చూపించారని, 2014 నాటికి ఆ ఆస్తుల విలువ రూ.1.03 కోట్లకు పెరిగిందని బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. తక్కువ వ్యవధిలో ఆస్తులు భారీగా ఎలా పెరిగాయో ప్రజలకు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. భూములపై సమగ్ర విచారణ జరపాలి. కాంగ్రెస్ పార్టీకి పేదలకు భూములు పంపిణీ చేసిన చరిత్ర ఉందని బీర్ల అయిలయ్య అన్నారు. తెలంగాణ ఉద్యమం ముసుగులో భారీగా ఆస్తులు, వందల ఎకరాల భూములు ఎలా సమకూరాయనే విషయాన్ని బీఆర్ఎస్ నేతలు ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. బీఆర్ఎస్ నేతల ఫామ్‌హౌస్‌ల చరిత్ర, వాటికి సంబంధించిన భూ లావాదేవీలను ప్రజలకు వివరిస్తామని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా భూములు ఆక్రమించినట్లు లేదా నిర్మాణాలు చేపట్టినట్లు విచారణలో తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**మాటతీరు మార్చుకోవాలి**

జగదీశ్‌రెడ్డి ముఖ్యమంత్రి, మంత్రులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని బీర్ల అయిలయ్య హెచ్చరించారు. నువ్వు ఉన్నది మూడు అడుగులైతే తొమ్మిది అడుగులు ఎగిరి మాట్లాడుతున్నావు. ముఖ్యమంత్రి, మంత్రులపై అవాకులు చవాకులు మాట్లాడితే తస్మాత్ జాగ్రత్త అని అన్నారు. అక్రమంగా ఆక్రమించుకున్నట్లు గుర్తించిన భూములను స్వాధీనం చేసుకుని అర్హులైన పేదలకు అందించే దిశగా ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రజాక్షేత్రంలో వాస్తవాలను వెలికితీసి ప్రజల ముందుంచుతామని స్పష్టం చేశారు. ఇకనైనా బీఆర్ఎస్ నేతలు తమ వైఖరిని మార్చుకుని ప్రజా పాలనలో నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషించాలని బీర్ల అయిలయ్య సూచించారు.

# బిజెపి ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేత

**వలిగొండ సెప్టెంబర్ 21(సమయం న్యూస్)** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని టేకుల సోమారం గ్రామానికి చెందిన బిజెపి కార్యకర్త, మాజీ వార్డ్ మెంబర్ కీర్తి వెంకటేశం పరమ పదించినారు. ఈ సందర్భంగా వారి దశదిన కర్మకు హాజరై బిజెపి వలిగొండ మండల శాఖ కార్యకర్తలు అందరం కలిసి మొత్తం 32 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి కిషన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్మోహన్ రెడ్డి, బిజెపి రాష్ట్ర నాయకులు బంధారపు లింగస్వామి, బిజెపి మండల నాయకులు మురళీధర్ రెడ్డి, మల్లా రెడ్డి రంజిత్ రెడ్డి, కిసాన్ మోర్చా నాయకులు బంధారపు రాములు, రామచంద్రు, శ్యామల అనిల్ రెడ్డి, నవీన్ రెడ్డి, పాండు, కొండల్ రెడ్డి, సురేందర్ రెడ్డి, శివకొంతం, పార్టీ వెంకట్ రెడ్డి మొదలగు నాయకులు పాల్గొన్నారు.